RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 48 శుక్రవారం 14 మార్చి 2025 పేజీలు : 4

## ఓటరు కార్డుకు ఆధార్, మొబైల్ లింక్

న్యూఢిల్లీ : ఓటర్ల గుర్తింపు సక్రమంగా జరిగేలా ఓటరు గుర్తింపు కార్డులను ఆధార్, మొబైల్ నంబర్లతో లింక్ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీఐ) అధికారులను ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారుల (సీఈవోల)కు సర్క్యులర్‌ను ఈసీఐ జారీ చేసిన ట్టు తాజాగా ఒక ఆంగ్ల పత్రిక వెల్లడించింది. దీంతోపాటు ఈనెల 4న నిర్వహించిన సీఈవోల కాన్ఫరెన్స్‌లో 'ఓపెన్ రిమార్క్స్ ఆఫ్ సీఈసీ' పేరిట సీఈవోలందరికీ పంపిణీ చేసిన పత్రాల్లోనూ అవే ఆదేశాలు ఉన్నాయని, ఆ ఆదేశాలను అన్ని జిల్లాల ఎన్నికల అధికా రులకు సర్క్యులేట్ చేయాలని సీఈవోలకు నిర్దేశించారని పేర్కొంది. 'ఓటర్ల గుర్తింపు సక్రమంగా ఉండేందుకు ఓటరు కార్డుతో ఆధార్, మొబైల్ నంబర్లను అనుసంధానించే అన్ని ప్రయత్నాలూ చేయాలి' అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్టు తెలిపింది.

# ఎవరిన్ని కుట్రలు చేసినా...

# నా పని నేను చేసుకుపోతా..!

## తెలంగాణలో భారత్ సమ్మిట్ నిర్వహించబోతున్నాం..




### బిజెపి - బిఆర్ఎస్‌లు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మీడియాతో చిట్ చాట్ లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో భారత్ సమ్మిట్ నిర్వహించబోతున్నాం.. దానికి సంబంధించినటువంటి అంశాలపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రితో చర్చిస్తాను.. డీలిమిటేషన్ అనేది సౌత్ ను లిమిటేషన్ చేయడానికే.. డీలిమిటేషన్ పై తెలంగాణలో జరిగే అఖిలపక్ష సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కచ్చితంగా హాజరు కావాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించినటువంటి అంశాల్లో కేంద్రం తీసుకునే నిర్ణయాల్లో కేంద్ర మంత్రులు కచ్చితంగా కీలకపాత్ర పోషిస్తారు అని పేర్కొన్నారు. గాంధీ కుటుంబంతో రేవంత్ రెడ్డికి బలమైన సంబంధాలు ఉన్నాయి.. ఈ విషయంలో ఎవరు ఎటువంటి ప్రచారాలు చేసిన ఇబ్బంది లేదు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఇక, కావాలనే కొందరు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు అని సీఎ రేవంత్ తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నాను.. అందులో భాగంగానే నామినేటెడ్ పదవులు, ఎమ్మెల్సీలు, ఇతర పదవులు కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. ఉన్నది ఉన్నట్టుగా చెప్పి పాలన చేయాలనేదే నా ఆలోచన.. అందుకే అప్పుల గురించి వాస్తవాలు ప్రజల ముందు పెడుతున్నాను.. ఇక, గవర్నర్ ప్రసంగం రోజే కాదు చర్చల్లో కూడా కేసీఆర్ పాల్గొనాలి అని ఆయన డిమాండ్ చేశారు. డీ లిమిటేషన్ అనేది లిమిటేషన్ ఫర్ సౌత్ అన్నారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి నేను ఇచ్చిన హామీలు అమలు చేశా.. పార్టీ పెద్దలలో ఫోటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదు.. నేను ఎవరో తెలీకుండానే పీసీసీ, సీఎంగా చేశారా అని ప్రశ్నించారు. నేను ఎవరి ట్రాప్ లో పడను.. సీఎంగా నేను ఉన్నాను కాబట్టే రాష్ట్రంలో నన్ను ప్రశ్నిస్తున్నారు.. కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి ఉన్నారు.. కాబట్టి ఆయన రాష్ట్రానికి సంబంధించిన అంశాలు సాధించడానికి రావాలని ప్రశ్నిస్తున్నారు.. మిగతా రాష్ట్రాల కేంద్రమంత్రులు వాళ్ళ రాష్ట్రాలకు కావాల్సినవి సాధించుకుంటున్నారు.. కిషన్ రెడ్డి రాష్ట్రానికి రావాల్సినవి పట్టించుకోవడం లేదని రేవంత్ రెడ్డి అన్నారు. అయితే, మెట్రో హైదారాబాద్ కి గేమ్ ఛేంజర్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 10 ఏళ్లలో కేసీఆర్ ఒక్క పాలసీ కూడా తేలేదు.. తెలంగాణలో నేను చేసినన్ని పాలసీలు ఎవరు చేయలేదు అని పేర్కొన్నారు. నిరుద్యోగా న్ని 8.8 నుంచి 6.1 శాతానికి తగ్గించాం.. 2.2 లక్షల కోట్ల పె ట్టుడులు తెలంగాణకి తెచ్చాం.. పన్ను వసూళ్లలో తెలంగాణ ముందంజలో ఉంది.. రాష్ట్రంలో పంటలు ఎండిపోతుంటే, టన్నెల్ లో ప్రాణాలు పోతుంటే, ప్రజలు కష్టాల్లో ఉంటే బీఆర్ఎస్ నేతలు డ్యాన్సులు వేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు అని ఆరోపించారు.

## పార్టీలో పదవుల పండగ.. వర్కింగ్ ప్రెసిడెంట్‌పై నేతల కన్ను




స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు తెలంగాణ కాంగ్రెస్‌లో పార్టీ పదవుల జాతర మొదలు కానుంది. దీనిపై కసరత్తు మొదలై పోయింది. పీసీసీ అధ్యక్షుడి తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కోసం నేతల మధ్య పోటీ ఎక్కువైనట్టు కనిపిస్తోంది. ఆ పదవి దక్కించుకుంటే ఫ్యూచర్‌లో లైఫ్ ఉంటుందనే ఆలోచనలు చేస్తున్నారు కొందరు నేతలు. ఆ తర్వాత పీసీసీ పదవికి పోటీ పడవచ్చని భావిస్తున్నారు కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు. ఈ క్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులకు నేతల పేర్లపై కసరత్తు జరుగుతోంది. సామాజిక వర్గానికి ఒకటి చొప్పున వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్టు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. మహేష్ కుమార్ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా ఉన్నారు. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఒకటి చొప్పున ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో 50 శాతానికి పైగా బీసీలు ఉండడంతో వారికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని ఓ వర్గం నేతలు బలంగా డిమాండ్ చేస్తోంది. ఈ విషయంలో గత ఫార్ములాను అనుసరించాలని పార్టీ ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఎస్టీల నుంచి ఎంపీ బలరాం నాయక్, బెల్లయ్యనాయక్, ఎస్సీల నుంచి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మైనార్టీ నుంచి ఫిరోజ్ ఖాన్, ఓసీల నుంచి ఎంపీతోపాటు మాజీ ఎంపీలు, కొందరు నేతలు రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. పార్టీ పదవుల కోసం సీనియర్ నేతలతోపాటు జూనియర్లు ఎక్కువ మంది పోటీపడడంతో జిల్లాకు ఒకరి చొప్పున నియమించాలనే ప్రతిపాదనలను సైతం పరిశీలిస్తోందట కాంగ్రెస్ పార్టీ. ఈ నేపథ్యంలో జిల్లాకు రెండు పదవులు సూచించాలని జిల్లాలకు చెందిన మంత్రులు, ఇన్ ఛార్జ్ మంత్రులకు పార్టీ సూచన చేసిందట.

క్షేత్రస్థాయిలో అంకితభావంతో పని చేసే వారిని పీసీసీ కార్యవర్గంలోకి తీసుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సూచించినట్టు పార్టీ వర్గాల మాట. ఈ నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడే పని చేసే వారి వివరాలను పీసీసీ అధ్యక్షుడు సేకరిస్తున్నారట. మొత్తానికి వారంలోగా పార్టీ పదవులను పూర్తి చేసి తర్వాత స్థానిక ఎన్నికల బాధ్యత ఆయా నేతలకు అప్పగించాలనే ఆలోచన చేస్తోందట కాంగ్రెస్ పార్టీ. దీనివల్ల పదవులు దక్కినవారు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత కూడా ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ఖరారు కాగానే జాబితా ఢిల్లీకి పంపి ఏఐసీసీ పెద్దలతో ఆమోదం తర్వాత అధికారికంగా ప్రకటన రానుంది.



## 15 నుంచి ఒంటిపూట బడులు..

### తెలంగాణ విద్యాశాఖ ప్రకటన

హైదరాబాద్: తెలంగాణలో మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పనిచేస్తాయని పేర్కొంది. పిల్లలకు 12.30గంటలకు మధ్యాహ్న భోజనం అందించి ఇంటికి పంపనున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల్ని సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఎస్సీ పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలు మాత్రం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. 2024- 25 విద్యా సంవత్సరంలో ఆఖరి రోజైన ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ ఆదేశాలను అన్ని మేనేజ్‌మెంట్లు అమలు చేసేలా పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



## తెలంగాణలో 5 ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవం

హైదరాబాద్ : తెలంగాణలో జరగనున్న 5 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ మేరకు ఎన్నికల అధికారులు అధికారిక ప్రకటన జారీ చేశారు. ఏకగ్రీవం అయిన ఎమ్మెల్సీలకు ధృవీకరణ పత్రాలు జారీ చేశారు. తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా విజయశాంతి, దాసోజు శ్రవణ్, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సత్యం నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు మరో ఆరుగురు నామినేషన్లు దాఖలు చేయగా.. నామినేషన్లు సరిగా దాఖలు చేయని కారణంగా అవి తిరస్కరించబడ్డాయి. దీంతో ఈ ఐదుగురు ఏకగ్రీవం అయ్యారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా కాంగ్రెస్ కు 4 స్థానాలు రాగా.. వాటిలో ఒకటి పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించింది. ఫలితంగా కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ లు.. సీపీఐ నుంచి సత్యం నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ కు ఒక స్థానం రాగా.. ఆ పార్టీ నుంచి దాసోజు శ్రావణ నామినేషన్ దాఖలు చేశారు. కాగా వీరంతా ఏకగ్రీవం అయినట్టు ఈసీ ప్రకటించింది.

## తెలంగాణ రైజింగ్‌కు

# కేంద్ర మద్దతు

## కోరిన సీఎం రేవంత్ రెడ్డి



ఢిల్లీ : తెలంగాణను ప్రగతి పథంలో నిలిపేందుకు, అభివృద్ధి కార్యక్రమాలకు మరింత మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. హైదరాబాదును అంతర్జాతీయ వేదికగా మార్చేందుకు చేపట్టిన ప్రాజెక్టులు, రాబోయే 25 సంవత్సరాల్లో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వ లక్ష్యాలు, ఈ క్రమంలో కేంద్ర సహకారం ఎంతో అవసరమని సీఎం వివరించారు. ముఖ్యంగా 2025లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్-గేమింగ్, వీఎఫ్ఎక్స్ తదితర అంతర్జాతీయ ఈవెంట్ల గురించి మంత్రి జైశంకర్ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రైజింగ్‌ను ప్రపంచ స్థాయిలో ప్రోత్సహించేందుకు కేంద్రం పూర్తి సహాయ సహకారాలు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను విదేశాల్లో కూడా ప్రచారం చేయాలనీ, దౌత్యపరమైన సహాయంతో పాటు లాజిస్టిక్స్ పరంగా కూడా కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తోందని, ముఖ్యంగా హైదరాబాద్ నగరం అంతర్జాతీయ వేదికలతో పాటు పెట్టుబడులకు అనుకూలంగా మారుతుందని ఆయన తెలియజేశారు. కేంద్ర మంత్రి జైశంకర్ తెలంగాణ అభివృద్ధిని ప్రశంసిస్తూ, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటిగా ఎదుగుతోందని, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు పూర్తి మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ, అంతర్జాతీయ సదస్సుల విజయవంతమైన నిర్వహణకు కేంద్ర సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, నాగర్ కర్నూల్, భువనగిరి ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.

# సంపాదకీయం

## దేవుడు ఉన్నాడా? లేడా? కొత్త వాదన విన్నారా?

దేవుడు ఉన్నాడా? లేడా? అన్న ప్రశ్న ఇప్పటిది కాదు. మనిషి పరిణామక్రమంలో వేలాది ఏళ్ల నుంచి వస్తున్నదే. నిజానికి దేవుడు అనే వాదనతోనే మానవాళికి సంబంధించిన ఎన్నో కీలక ఘట్టాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటి అత్యాధునిక కాలంలోనూ దేవుడి చుట్టూనే రాజకీయ.. సామాజిక.. ఆర్థిక అంశాలే కాదు.. మన బతుకులు ఎలా ఉండాలన్నది డిసైడ్ చేస్తుంది. మరి.. దేవుడి విషయంలో నమ్మకాలు.. భావోద్వేగాల్ని పక్కన పెట్టేద్దాం. మరి.. సైన్స్ ఏం చెబుతుంది? అన్న ప్రశ్న తెర మీదకు వచ్చినప్పుడు సమాధానాలు పెద్దగా కనిపించవు. దేవుడు ఉన్నాడా? లేడా? అన్న దానిపై ఆస్తికులు.. నాస్తికుల వాదనలు తెలుసు. ఇదంతా పక్కన పెడితే.. ఇప్పుడీ తేలని పంచాయితీని ఎందుకు ప్రస్తావిస్తున్నట్లు? అన్న సందేహానికి వస్తున్నారా? అక్కడికే వస్తున్నాం. హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఖగోళ.. భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ విల్లీ సూన్ ఆసక్తికర వాదనను వినిపిస్తున్నారు. అదేమంటే.. దేవుడి ఉనికిని గణిత సూత్రం నిరూపిస్తుందన్నది ఆయన వాదన. జీవం పుట్టుకకు కచ్చితమైన.. నిర్దిష్టమైన పరిస్థితులు అనుకూలించిన విధానాన్ని చూస్తే.. అవేవో యాక్సిడెంటల్ గా జరిగినవిగా కనిపించవన్నది ఆయన మాట. జీవం మనుగడ సాగించటానికి వీలుగా విశ్వాన్ని రచించినట్లుగా ఆయన చెబుతున్నారు. ఇందుకు బిగ్ బ్యాంగ్ థియరీని ప్రస్తావిస్తూ.. మహా విస్పోటనం జరిగినప్పుడు పదార్థం.. వ్యతిరేక పదార్థం రెండు పుట్టుకొచ్చాయని.. పదార్థం కంటే వ్యతిరేక పదార్థం తక్కువ మోతాదులో ఏర్పడటమే జీవం పుట్టుకకు కారణమైందని ఆయన చెబుతున్నారు. విశ్వంలోని వివిధ మూలకాలు.. అంశాల్ని చూసినప్పుడు ఏదో అత్యున్నత శక్తి పని చేస్తున్నట్లుగా చెబుతారు. దీనికి ఉదాహరణగా గురుత్వాకర్షణ సమాన స్థితిలో ఉండటం ఈ వాదనకు బలం చేకూరేలా చేస్తుంది. అదే గురుత్వాకర్షణశక్తి బలహీనంగా ఉంటే.. నక్షత్రాలు.. నక్షత్ర మండలాలు.. గ్రహాలు ఏర్పడేవి కాదు కదా? ఒకవేళ గురుత్వాకర్షణ శక్తి మరికాస్త బలంగా ఉండే క్రిష్ణబిలంలో విశ్వం కుప్పకూలిపోయేది కదా? అన్నది మరో ప్రశ్న. ప్రోటాన్ ఎలక్ట్రాన్ ద్రవ్యరాశి నిష్పత్తి భిన్నంగా ఉంటే.. డీఎన్ఏ లాంటి అణువులు ఏర్పడటం సాధ్యమయ్యేది కాదు. విశ్వం విస్తరిస్తున్న వేగాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి. ఇది మరీ వేగంగా విస్తరించినా.. త్వరగా కుప్పకూలినా విశ్వంలో జీవం పుట్టుకొచ్చేది కాదన్న మాట ఆయన చెబుతున్నారు. ఇదంతా విన్నప్పుడు కొన్ని దశాబ్దాల క్రితం (సుమారు అరవైల్లో)దేవుడిని గొప్ప గణితవేత్తగా సైన్స్ పత్రికల్లో వ్యాసాలు రాసిన కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రొఫెసర్ పాల్ డిరాక్ గుర్తుకొస్తారు. దేవుడి గురించి ఆయన వ్యాఖ్యానిస్తూ.. "దేవుడు మహా గొప్ప గణితవేత్త. ఆయన విశ్వ నిర్మాణంలో గణితాన్ని గొప్పగా వాడుకున్నారు'' అని చెప్పటం తాజా వాదనతో గుర్తుకొస్తుంది.

## నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్ఆర్ఎస్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ గౌతమ్





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్ఆర్ఎస్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలనీ మేడ్చల్ మల్కాజ్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వార్డు ఆఫీసర్లతో %LRS% ప్రక్రియపై ఆరాతీసి , ఫీల్డ్ ఇన్స్పెక్షన్ ఏ విదంగా చేస్తున్నారు, మొబైల్ ఆప్ ద్వారా అప్లికేషన్ నంబరు , పేరు , మొబైల్ నెంబర్ మొదలగు వివరాల ద్వారా ఫీల్డ్ ఇన్స్పెక్షన్ చేసి రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ కాపీలను వీలైనంత తొందరగా అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు, దాని వలన ప్రజల్లో నమ్మకం కలిగి మిగితా వారు కూడా రుసుము చెల్లించడానికి ముందుకొచ్చే అవాకారం ఉందని తెలిపారు. అప్లికేషన్లను క్రమబద్ధమైన మాపింగ్ చేసి ప్రతి ఒక్క వార్డు ఆఫీసర్లు నిర్ణీత వ్యవధిలో నిర్దేశించిన %LRS% ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నెల 31లోగా క్రమబద్దీకరణ రుసుము చెల్లించినట్లయితే ప్రభుత్వం 25 శాతం రాయితీ అందిస్తుందని దరఖాస్తుదారులకు వార్డు ఆఫీసర్లు తెలపాలని ఆ దిశగా జిల్లాలోని మున్సిపల్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ సిబ్బందిని కలెక్టరు ఆదేశించారు. ఈ క్రమంలో ప్రతిరోజు క్రమబద్దికరణ దరఖాస్తుల పై పురోగతిని, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులకు కారణాలు తెలపాలని సూచించారు. %LRS% హెల్ప్ డెస్క్ లో వచ్చే ఫిర్యాదులను కూడా పరిగణలోకి తీసుకొని సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సాంకేతిక సమస్యలద్వారా వచ్చే ఇబ్బందులను అధిగమిస్తూ ఈ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూలు చేసే ప్రక్రియ వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కార్పొరేషన్ పరిధిలో యూనిఫామ్ టాక్స్ పద్దతిని అమలు పర్చడానికి కృషి చేయాలనీ అందుకు కాను తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా కంచె నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ షబ్బీర్ అలీ , బాచుపల్లి MRO ఫూల్ సింగ్ , మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం



శామీర్ పేట, (గరుడ వార్త) : ముఖ్యంగా మధుమేహం (షుగర్) , బీపి వ్యాధులు ఉన్నవారువైద్యుల ఆరోగ్య సూచనల మేరకు జాగ్రతలను పాటిస్తు కిడ్నీలను కాపాడుకోవాలని డాక్టర్ అనంతరెడ్డి సూచించారు. గురువారం శామీర్ పేట మండలం తుర్కపల్లిలో ఇంపాక్ట్ గురు ఫౌండేషన్(ఐజీఎఫ్) స్వచ్ఛంద సంస్థ, దాట్ల ఫౌండేషన్ బీఈ కంపెనీ వారి సహకారం తో వరల్డ్ కిడ్నీ డే- 2025 (దినోత్సవాన్ని) పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ అనంతరెడ్డి మాట్లాడుతూ షుగర్, బీపి తో బాదపడుతున్న వారు, కుటుంబంలో కిడ్ని సమస్యలున్నవారు ఉన్నవారు కిడ్నీ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాంటి వారు సంబందిత వైద్యులతో తరచుగా కిడ్ని పరీక్షలను తప్పని సరిగా చేయిం చుకోవాలని ఆయన వివరించారు. నొప్పి నివారణ మందులను వాడకం, సొంత వైద్యం ప్రమాదకరమని, ఉప్పు వాడకం తగించాలని, నీరును సరైన విధంగా తాగాలని ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ విషయంలో జాగ్రతలను పాటించక నిర్లక్ష్యంగా ఉంటే కిడ్నిలు చెడిపోయే ప్రమాదం ఉందని, ప్రాణాలను సైతం కోల్పోవల్సి వస్తుందని ఆయన తెలిపారు. బీపీ, షుగర్ ఉన్నవారు ప్రతి ఆరు నెలలకు ఒక సారి తప్పని సరిగా కిడ్నిల పరీక్షలను చేయించుకొని వైద్యుల సూచనల మేరకు నడుచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐజిఎఫ్ స్వచ్ఛంద సంస్థ, దాట్ల ఫౌండేషన్, బీఈ కంపెనీ ప్రతినిధులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంఈఓ గా కమలాకర్ నియామకం



శామీర్ పేట, (గరుడ వార్త) : నూతన ఎంఈఓ గా ఆర్ కమలాకర్ ను నియమిస్తూ సంబంధిత శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శామీర్ పేట మండల ఎంఈఓ గా విధులు నిర్వహించిన వసంతకుమారి ఇటీవల పదవి విరమణ పొందారు. గురువారం ఆ స్థానంలో నూతన ఎంఈఓ గా శామీర్ పేట మండలం బొమ్మరాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యా యుడు ఆర్ కమలాకర్ ను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రధానోపాధ్యాయుడి విధులతోపాటు ఎంఈఓ గా బాధ్యతలు నిర్వహించనున్నారు.

## తడారి..నెర్రెలు బారి!



ఎల్లారెడ్డిపేట : జిల్లాలో వరికి సాగునీటి వినియోగం భారీగా పెరుగుతోంది. పైరు పొట్టదశ, ఈనే దశకు చేరుతుండగా భూగర్భజలాలను అధికంగా వాడుతున్నారు. ఓ వైపు ఎండలు ముదిరిపోతుండడం, మరోవైపు సాగునీటిని ఎక్కువగా పారించడం వల్ల చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ఈ ప్రభావం భూగర్భజల మట్టాలపై పడుతోంది.

**గణనీయంగా సాగు**

మెట్ట ప్రాంతమైన జిల్లాలో జనవరిలో జిల్లా సగటున 7.98 మీటర్ల మేర భూగర్భజల మట్టాలున్నాయి. రైతులు యాసంగిలో ఇప్పటి వరకు ప్రధానంగా 169,675 ఎకరాల్లో వరి, 50 ఎకరాల్లో గోధుమ, 1491 ఎకరాల్లో మొక్కజొన్న, 180 ఎకరాల్లో శనగ, 134 ఎకరాల్లో నవ్వులు, 25.2 ఎకరాల్లో వేరుసెనగ, 1021 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంటలను సాగు చేశారు.

**ముమ్ముందు మరింత తీవ్రం**

జిల్లా దిగువ ప్రాంతాన జలం సమృద్ధిగా ఉండగా ఎగువన బోరుబావుల్లో నుంచి ఊట క్రమంగా తగ్గిపోతోంది. కొన్నిచోట్ల పూర్తిగా వట్టిపోతుండగా పైర్లు ఎండిపోతున్నాయి.

ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, దేవునిగుట్టతండా, తిమ్మాపూర్ తదితర గ్రామాలతోపాటు గంభీరావుపేట, వీర్నపల్లి, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, వేములవాడ అర్బన్ మండలాల్లో భూగర్భ జలమట్టాలు లోతులోకి వెళ్లడంతో సీజనల్ గొట్టపుబావులు మొండికేస్తున్నాయి.

జిల్లాలో నెల వ్యవధిలోనే భూగర్భ జల మట్టాలు 0.96 మీటర్ల లోతుకు పడిపోవడం తీవ్రతకు అద్దం పడుతోంది.

ఎల్లారెడ్డిపేట మండలంలో అత్యధికంగా 13.82 మీటర్ల లోతుతో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

డిసెంబరు మాసంలో జిల్లా సగటు భూగర్భజల మట్టాలు 7.02 మీటర్లుండగా ఈ ఏడాది జనవరి మాసంలో 7.98 మీటర్ల లోతుకు చేరుకున్నాయి. అతికొద్దిలోతు 3.97 మీటర్లలో చందుర్తి మండలంలో భూగర్భజల మట్టాలుండగా ఎక్కువలోతు 13.82 మీటర్లలో ఎల్లారెడ్డిపేట మండలంలో జలాలు లభిస్తున్నాయి.

గతేడాది మేతో పోల్చితే ఈ జనవరిలో 2.63 మీటర్ల మేరకు పెరుగగా గతేడాది జనవరితో పోల్చితే ఈ సంవత్సరం జనవరిలో 0.72 మీటర్ల మేర పెరిగాయి. భూగర్భజల మట్టాల్లో తరుగుదల రానున్న ఫిబ్రవరి, మార్చి మాసాల్లో మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉండగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

## వడపోద్దాం.. వాడేద్దాం

హైదరాబాద్ : నగరంలోని గేటెడ్ కమ్యూనిటీల్లో శుద్ధి చేసిన మురుగునీరు పునర్వినియోగంతో నీటి కొరతకు కొంతమేర పరిష్కారం చూపేందుకు జలమండలి కార్యాచరణను సిద్ధం చేసింది. బల్దియాలో నీటి అవసరాలు పెరుగుతుండటంతో ప్రత్యామ్నాయాల వైపు దృష్టిసారిస్తోంది. నగరంలోని గేటెడ్ కమ్యూనిటీల్లోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ)ల నిర్వహణను ప్రత్యేకంగా పరిశీలించనుంది. వీటిని నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవడంతో పాటు మురుగుజలాలను శుద్ధి చేసి వాటిని తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగించుకోవాల్సి ఉంది. ప్రాథమిక అంచనాల ప్రకారం ఇలాంటి ఎస్టీపీలు నగరంలో వెయ్యిదాకా ఉన్నట్లు జలమండలి గుర్తించింది. ఇవి పనిచేస్తున్నాయా? లేదా? పని చేస్తే ఏ ప్రమాణాల మేర శుద్ధి చేస్తున్నారు? ఆ నీటిని వినియోగిస్తున్నారా? లేదా? అనే అంశాలు పరిశీలించనుంది.

**పనితీరు మదింపు**



నగరంలోని ప్రైవేటు ఎస్టీపీలను గుర్తించి డేటాను రూపొందించడంతో పాటు వాటి పనితీరును థర్డ్‌పార్టీతో మదింపు చేసేందుకు జలమండలి రంగం సిద్ధం చేసింది. వందశాతం నిబంధల మేరకు నిర్వహించాలని జలమండలి ఇప్పటికే గేటెడ్ కమ్యూనిటీలను ఆదేశించింది. ఆస్కి లేదా ఈపీటీటీఆర్ఐ వంటి సంస్థలతో ప్రైవేటు ఎస్టీపీలను మదింపు చేయనున్నారు. నిబంధనల మేరకు లేని గేటెడ్ కమ్యూనిటీలపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే జరిమానా విధించాలని జలమండలి భావిస్తోంది.

**50 శాతం రాయితీ..**

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిబంధనల మేరకు శుద్ధి చేసిన మురుగునీటి జలాలను కనీసం 50 శాతం పునర్వినియోగించుకోవాలి. ఇటీవల జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి నగరంలోని బిల్డర్లతో సమావేశమైనప్పుడు గేటెడ్ కమ్యూనిటీల్లోని ఎస్టీపీల నిర్వహణపై ప్రత్యేకంగా చర్చించారు. నిర్వహణ, మురుగునీటి శుద్ధి ప్రమాణాలను జలమండలి పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. పూర్తి స్థాయిలో ఎస్టీపీలను ఏర్పాటు చేసుకున్నవారికి సీవరేజీ ఛార్జీల్లో 50 శాతం దాకా రాయితీ ఇవ్వనున్నారు.

## అభయహస్తంపై ఆశలు

పెద్దపల్లి : కొన్నేళ్లుగా నిలిచిపోయిన అభయ హస్తం సొమ్ము చెల్లించనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటన ఖాతాదారులకు ఊరట కలిగిస్తోంది. ఈ మేరకు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న స్వయం సహాయక మహిళలకు ఇబ్బందులు తీరనున్నాయి. నెలాఖారులోపు అర్హుల ఖాతాలో డబ్బులు జమ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితా రూపొందించనున్నారు. దశాబ్ద కాలం తర్వాత మహిళలు పొదుపు చేసిన సొమ్ము తిరిగి జమ కానుండటంతో హర్షం వ్యక్తమవుతోంది.

**పింఛను.. ఉపకార వేతనాలు**

స్వశక్తి సంఘాల సభ్యుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టింది. సంఘంలో చేరిన ప్రతి మహిళ ఏడాదికి రూ.365 చొప్పున ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం మరికొంత నగదు జమచేసేది. 60 ఏళ్లు దాటిన మహిళలకు ప్రతి నెలా రూ.500 పింఛను చెల్లించాలన్నది లక్ష్యం. అలాగే కుటుంబంలో 9, 10 తరగతులు, ఇంటర్, ఐటీఐ చదివే విద్యార్థులు ఉంటే ఏడాదికి రూ.1200 చొప్పున ఇద్దరు పిల్లలకు ఉపకార వేతనాలు అందించేవారు. అభయ హస్తం



లబ్ధిదారులు సహజ మరణం పొందితే రూ.30 వేలు, ప్రమాదవశావత్తు మరణిస్తే రూ.70 వేల పరిహారాన్ని కుటుంబాలకు అందించేవారు.

**పదేళ్లుగా నిరీక్షణ**

2014లో రాష్ట్ర పునర్విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని నిలిపివేసింది. ఆసరా పథకాన్ని ప్రారంభించి పింఛను సొమ్ము రెట్టింపు చేసింది. అంతకుముందు అభయహస్తం పథకానికి పదేళ్ల పాటు కట్టిన డబ్బులు తిరిగి చెల్లిస్తామని పలుమార్లు చెప్పినా కార్యరూపం దాల్చలేదు. 60 ఏళ్లు దాటిన మహిళల్లో చాలా మందికి అటు ఆసరా, ఇటు అభయహస్తం సొమ్ము అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవిత చరమాంకంలో ఆర్థిక భరోసా ఇస్తుందని ఆశించిన మహిళలు నిరాశకు గురవుతున్నారు.

**మొత్తం 3,34,232 మంది**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 3,34,232 మంది మహిళలు అభయహస్తం పథకానికి ప్రీమియం సొమ్ము చెల్లించారు. వీరిలో ఎంతమంది 60 ఏళ్లు పైబడి ఉన్నారో క్షేత్ర స్థాయిలో సెర్ప్ అధికారులు తేల్చనున్నారు. మృతుల పేర్లను జాబితా నుంచి తొలగించి, గ్రామాల వారీగా వివరాలు సేకరించనున్నారు. ఈ మేరకు అర్హుల లెక్క తేలనుంది. స్వశక్తి సంఘాల్లోని మహిళల ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకొని ప్రభుత్వానికి నివేదించనున్నారు. గతంలో మాదిరిగానే పిల్లలకు ఉపకార వేతనాలు అందనున్నాయి. నాలుగేళ్లు క్రమం తప్పకుండా చెల్లించా..మా సంఘంలో నాలుగేళ్లు క్రమం తప్పకుండా ఏడాదికి రూ.365 చొప్పున చెల్లించా. నాకు 60 ఏళ్లు దాటడంతో అభయహస్తం పింఛన్ కోసం ఎదురుచూస్తున్నా. మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కనకమ్మ, కమాన్‌పూర్ మండలం


# ఏజెన్సీ భూములకు అక్రమ పట్టాలు!

ఆసిఫాబాద్ : క్రయ విక్రయాలకు వీలులేని ఏజెన్సీ భూములవి. అయినా గద్దల్లా కొందరు తన్నుకుపోయి, అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. వీటిని సరిచేసి న్యాయం చేయాలని బాధితులు ఒకవైపు కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, మరోవైపు కబ్జాదారులు ఇతరులకు విక్రయిస్తున్నారు. ఆయా కార్యాలయాల్లో తిష్ఠవేస్తున్న దళారులు.. చిన్నపాటి లొసుగుల ఆధారంగా అధికారులను మచ్చిక చేసుకుని భూ దందాలను నడిపిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఏజెన్సీ ప్రాంతం విస్తరించి ఉంది. ఐటీడీఏ కార్యాలయం నుంచి వచ్చే కే–ఫాం, ఎల్–ఫాం సహాయంతో గిరిజనులకు మాత్రమే పట్టాలు అవుతాయి. ఇతరులకు పట్టాల జారీ నిషేధం. ఆసిఫాబాద్, జైనూర్, సిర్పూర్(యు), కాగజ్‌నగర్, తిర్యాణి, సిర్పూర్(టి), కెరమెరి, వాంకిడి, రెబ్బెన మండలాల్లో ఏజెన్సీ భూములు కనుమరుగవుతున్నాయి. ఈ మండలాల్లో అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో వెంచర్లు వేస్తున్నారు. పంచాయతీ, పుర అధికారులు ఇష్టానుసారంగా ఇంటి నంబర్లు జారీ చేయడంతో.. ఈ ప్రాంతాల్లో భవనాలు వెలుస్తున్నాయి.

**జిల్లా కేంద్రంలోనూ...**

జిల్లా కేంద్రంలో గుండి వెళ్లే మార్గంలో కుడివైపు ఏజెన్సీ భూముల్లో వెంచర్ వేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మూడు, నాలుగు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా.. అధికారులు అటువైపు చూడడం లేదు. సర్వే నం.21/1/1లో 2.30 ఎకరాల వెంచర్‌లో అక్రమ కట్టడాలు పదుల సంఖ్యలో ఉండడం గమనార్హం. చెక్‌పోస్టు ఎదురుగా సైతం బీడీపీపీ కబ్జాలను తొలగించాలని అధికారులు హడావుడి చేసినా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆసిఫాబాద్ మండలం ఇప్పల్‌నవేగాం గ్రామానికి






చెందిన ఆత్రం నాగయ్య 2019లో అనారోగ్యంతో మరణించారు. అతనికి సర్వే నం.14/4లో 3.29 ఎకరాలు ఉన్నాయి. భర్త చనిపోవడంతో భార్య లత మహారాష్ట్రలోని పుట్టింటికి వెళ్లింది. సమగ్ర సర్వే అనంతరం ఈ భూమిని మరో వ్యక్తి పేరు (మొండి)తో అధికారులు పట్టా చేసి ఇచ్చారు. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన ఈ చోట, గిరిజనేతరులకు పట్టా చేసి ఇవ్వడం గమనార్హం. లత విరాసత్ కోసం 2024 ఏప్రిల్‌లో రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇదే సర్వే నంబర్‌తో మరో వ్యక్తికి పట్టా ఉండడంతో, దానిని తొలగించి, న్యాయం చేయాలని బాధితురాలు నాలుగేళ్ల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉంది.

**వారసుల పేరుతో...**

ఆసిఫాబాద్ మండలంలోని రహపల్లి పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం. భూ యజమాని చనిపోతేనే వారసులకు విరాసత్ చేయాలి. కానీ యజమాను లు బతికే ఉన్నా.. వారసులు కాని వారికి (విక్రయించి) పట్టాలు చేస్తున్నారు. కొందరు దళారులు ముఖ్యపాత్ర పోషించి ఈ తతంగాన్ని జరిపించారు. రెండు, మూడు నెలల కిందట ఈ ఒక్క గ్రామంలో వందలాది ఎకరాలకు అక్రమ పట్టాలు పుట్టుకురాగా, రూ.కోటి వరకు చేతులు మారినట్లు సమాచారం. న్యాయం చేస్తాంరోహిత్, తహసీల్దార్ ఏజెన్సీ భూముల్లో ఇతరులకు పట్టాలు జారీ అయిన విషయం గుర్తించాం. వీటిని రద్దు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే తొలగిస్తాం.

# సమన్వయలోపం.. తీరని దాహం

ఆసిఫాబాద్ : పల్లెల్లో తాగునీటి ఎద్దడి నివారించడానికి సౌరనీటి యూనిట్లను ఏర్పాటు చేశారు. బోరు, సింథటిక్ ట్యాంకు, సౌరఫలకలు ఆయా గ్రామాల్లో ఉంచారు. ఇవి బిగించిన నాటి నుంచి నిర్వహణ లేక, నీళ్లందించక మొరాయిస్తున్నాయి. చిన్నపాటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రూ.కోట్ల ఖర్చు బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారి, గ్రామస్థులు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న ప్రస్తుత సమయంలో ఈ యూనిట్లకు మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు అందేలా చూడాల్సిన అవసరం ఉంది. కుమురం భీం జిల్లా తిర్యాణి మండలంలోని జెండగూడ గ్రామంలో ఐటీడీఏ అధికారులు రూ.7 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సౌర ప్లాంట్ ఇది. నెల రోజులు సైతం పనిచేయక మూలకు చేరింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ నుంచి సౌర యూనిట్ల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. ఆ పనులను మిషన్ భగీరథ అధికారులు చేశారు. అయితే మరమ్మతులు చేయడానికి ఈ రెండు శాఖల అధికారులు నిరాకరిస్తున్నారు. సమన్వయలోపం కారణంగా సౌర యూనిట్లు పనిచేయక మూలకు చేరుతున్నాయి. అయిదు సంవత్సరాల వరకు గుత్తేదారు వీటి బాధ్యతలను చూడాల్సి ఉండగా ఎక్కడా వీటిని పట్టించుకున్న పాపాన పోలేదు.



**రూ.6.30 కోట్ల నిధులు**

కుమురం భీం జిల్లాలో ఐటీడీఏ నుంచి 76, మిషన్ భగీరథ పథకంలో 7 సౌర యూనిట్లు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా పరిధిలో 22 ఉండగా మొత్తం 105 వరకు సౌర యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్కు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు ఖర్చు చేశారు. సగటున రూ.6 లక్షలు ఖర్చు చేసినా మొత్తం రూ.6.30 కోట్లు వీటి కోసమే ఖర్చు చేశారు. చాలా ప్రాంతాల్లో బిగించిన ఒకటి, రెండు నెలలకే ఇవి తాగునీరందించక అలంకారప్రాయంగా మారడంతో రూ.కోట్ల నిధులు గుత్తేదారుల ధనదాహాన్ని మాత్రమే తీర్చాయి. ఆసిఫాబాద్ మండలం గొగియన్ మోవాడ్‌లో ఏర్పాటు చేసిన సౌర ప్యానెల్ ధ్వంసమయ్యాయి.

రెబ్బెన మండలంలోని ఇందిరానగర్ వద్ద ఒక్క రోజూ సౌర ప్లాంట్ తాగునీరు అందించలేదు. వాంకిడి మండలం డొంగరగావ్, సోనాపూర్, ఆకిని, బెజ్జూరు మండలం కాటేపల్లి గ్రామంలోని సౌర యూనిట్లు వృథాగా మారాయి.

**పని చేసేలా చర్యలు-సిద్ధిఖీ, ఈఈ, మిషన్ భగీరథ ఇంట్రా**

వేసవి నేపథ్యంలో సౌర యూనిట్లకు మరమ్మతులు చేస్తాం. ఇప్పటికే లొద్దిగూడలో చేశాం. త్వరలో పనిచేయని వాటన్నింటిని పనిచేసేలా చూస్తాం.

# కుదిరిన సయోధ్య.. కొత్త రహదారికి సై




హైదరాబాద్ : కంటోన్మెంట్‌లోని రోడ్ల సమస్య కొలిక్కి వచ్చింది. మల్కాజిగిరి, సైనిక్‌పురి, ఈసీఐఎల్ తదితర ప్రాంతాల నుంచి సికింద్రాబాద్ వైపు రాకపోకలు సాగించే వాహనదారుల కష్టాలు తీర్చేందుకు సైనికాధికారులు, జీహెచ్ఎంసీ ఇంజినీర్లు సయోధ్యకు వచ్చారు. ఏఓసీ కూడలి మీదుగా సఫిల్‌గూడ, ఆర్కేపురం వరకు నిర్మించతలపెట్టిన ప్రత్యామ్నాయ రహదారిపై ఇరువర్గాల మధ్య ప్రతిష్టంభన దాదాపు తొలగిపోయింది.

**రోడ్ల మూసివేతపై..**

సికింద్రాబాద్ నుంచి సఫిల్‌గూడ, మల్కాజిగిరి, ఆర్కేపురం, సైనిక్‌పురి, ఈసీఐఎల్ ప్రాంతాల మధ్య రోజూ లక్షలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సికింద్రాబాద్‌లోని ఈస్ట్‌మారేడుపల్లి చెక్‌పోస్టు నుంచి ఆర్మీ ఆర్డినెన్స్ సర్కిల్(ఏఓసీ) మీదుగా ఆయా ప్రాంతాలకు 24గంటల పాటు వాహనరద్దీ ఉంటుంది. సైనిక స్థావరాల్లోని వెల్లింగ్టన్, ఆర్డినెన్స్ రోడ్డు, గఫ్ రోడ్లను ప్రజలు వినియోగిస్తుంటారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలు, ఇతర సందర్భాల్లో అధికారులు ఏఓసీ గేటు, వెల్లింగ్టన్ రోడ్లను పూర్తిగా మూసేస్తుంటారు. దీంతో సఫిల్‌గూడ, ఆర్కేపురం, సికింద్రాబాద్ మధ్య రాకపోకలు స్తంభించిపోతాయి.

**న్యాయస్థానం సూచనతో..**

రహదారులను మూసివేయాల్సి వస్తే.. మీ ప్రాంతంలో ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించేందుకు స్థలం ఇవ్వాలని న్యాయస్థానం లోకల్ మిలటరీ అథారిటీ(ఎల్ఎంఏ)ని ఆదేశించిందని, ఆమేరకు కొత్త రోడ్డు అభివృద్ధి ప్రాజెక్టును రూపొందించామని జీహెచ్ఎంసీ చెబుతోంది. మూడేళ్ల కిందట ఈ ప్రతిపాదనను జీహెచ్ఎంసీ ఎల్ఎంఏ ముందు ఉంచగా.. తాము కోల్పోతున్న 42ఎకరాల భూమికి రూ.450కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని సైనికాధికారులు బల్దియాను కోరారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించకపోవడంతో.. ఆ ప్రతిపాదన అటకెక్కింది.

**తాజా ప్రతిపాదనతో..**

ఆర్డినెన్స్ రోడ్డు, గఫ్ రోడ్డులను పూర్తిగా మూసేసి.. ఆర్కేపురం రైల్వే స్టేషన్ నుంచి సఫిల్‌గూడ రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) వరకు రోడ్డును నిర్మించాలన్నది కొత్త ప్రతిపాదన. సఫిల్‌గూడ ఆర్‌యూబీ నుంచి ఏఓసీ చౌరస్తా వరకు కొత్త రోడ్డు మార్గం, కొంత పైవంతెన నిర్మాణం ఉండనుంది. రోడ్డు నిర్మాణం కోసం 35.5ఎకరాలు నష్టపోతున్నామని, ఆమేరకు వేరే చోట భూమిని ఇవ్వాలని ఎల్ఎంఏ కోరుతోంది. ఏడు ఎకరాల పరిధిలో పైవంతెనను నిర్మిస్తున్నందున.. ఆ భూమికి ఏటా లీజు రుసుము చెల్లించాలని ప్రతిపాదించింది. వాటిపై మరోసారి సమావేశమై, క్షేత్రస్థాయిలో పర్యటించి తుది నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ ఇలంబర్తి ఎల్ఎంఏ అధికారులకు స్పష్టం చేశారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.400కోట్లు అని, 100అడుగుల వెడల్పు, 6కి.మీ పొడవున రోడ్డును అర్ధ చంద్రాకారంలో అభివృద్ధి చేయనున్నట్టు ఇంజినీర్లు తెలిపారు.

**విలీనంపై కదలిక..**

కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీన ప్రక్రియపై బల్దియా కసరత్తు ప్రారంభించింది. గతంలో ఏర్పాటైన కమిటీ ఏడు ప్రధానాంశాలను తెరపైకి తెచ్చిందని, వాటిపై చర్చించేందుకు వారంలో బోర్డు అధికారులతో సమావేశం కానున్నట్టు కమిషనర్ ఇలంబర్తి తెలిపారు.

# ఎల్ఆర్ఎస్‌లో ప్రొరేటా గందరగోళం



హైదరాబాద్: అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు సంబంధించి భవిష్యత్తు అవసరాల కోసం వదిలిన ఖాళీ స్థలానికి చెల్లించాల్సిన ఛార్జీల్లో ప్రొరేటా విధానంపై గందరగోళం నెలకొంది. దీని ప్రకారం ఓపెన్ స్పేస్ ఛార్జీలు చెల్లిస్తే సరిపోతుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఈ విధానం ప్రకారం ఎలాంటి మినహాయింపు ఇవ్వకుండా పూర్తి స్థాయిలో ఛార్జీలు వసూలు చేస్తున్నారు. కొందరు దరఖాస్తుదారులు సైతం దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా మొత్తం 14 శాతం ఛార్జీలు చెల్లిస్తున్నారు.

**అవగాహన లేకపోవడంతో..**

ఈ నెల 31లోగా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించిన వారికి 25శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆగస్టు 26, 2020కు ముందు ఉన్న పంచాయతీ లేఅవుట్లకు మాత్రమే ఈ అవకాశం కల్పించారు. ఇలాంటి లేఅవుట్లలో కనీసం 10 శాతం ఇప్పటికే రిజిస్ట్రేషన్ అయి ఉండాలనేది నిబంధన. ఎల్ఆర్ఎస్ రుసుముతోపాటు 14 శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీలు చెల్లించాలి. నిబంధన ప్రకారం ప్రతి లేఅవుట్‌లో పది శాతం ప్రజా అవసరాల కోసం ఖాళీ స్థలాన్ని వదలాలి. అక్రమ లేఅవుట్లలో మాత్రం చాలావరకు వదల్లేదు. వీటికి కూడా అదనంగా 14 శాతం ఛార్జీలు వసూలు చేస్తున్నారు. కొందరు పది శాతానికి బదులు ఐదు శాతమే వదిలేశారు. దీని ప్రకారం ఐదు శాతానికే ఓపెన్ స్పేస్ ఛార్జీలు వసూలు చేయాలి. ఇందుకు విరుద్ధంగా 14 శాతానికి తీసుకుంటున్నారు. దరఖాస్తుదారులకు సైతం అవగాహన లేక మొత్తం ఫీజులు చెల్లిస్తున్నారు.

**ఫీజులు చెల్లిస్తున్నారు... తర్వాత ఏమిటి?** ఒక్క హెచ్ఎండీఏలోనే 3.2 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. చెరువులు, ఇతర నీటి వనరులకు 200 మీటర్లలో దూరంలో ఉన్న లేఅవుట్లను విడదీసి రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాలకు పంపి ఆరా తీస్తున్నారు. వివాదాలు లేని ప్లాట్లకు ఆటోమేటిక్‌గా ఫీజు జనరేట్ కావడంతో చాలామంది ముందుకువస్తున్నారు. ఫీజులు చెల్లింపు ప్రక్రియ చురుగ్గా నడుస్తోందని అధికారులు చెబుతున్నారు. ఫీజు చెల్లింపు తర్వాత రసీదు లేదా ఇతర వివరాలు ఏవీ వినియోగదారులకు ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో కనిపించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కట్టిన డబ్బులు ప్రభుత్వానికే వెళుతున్నాయో.. లేదో తెలియడం లేదని వాపోతున్నారు. ఫీజు చెల్లిస్తే ఆన్‌లైన్‌లోనే ప్రొసీడింగ్స్ ఇస్తామని అధికారులు అంటున్నారు.

# ఎకో క్లబ్‌ల ఏర్పాటుకు నిధుల మంజూరు

కాగజ్‌నగర్ : పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా.. ఎకో క్లబ్‌ల ఏర్పాటుతోపాటు వాటికి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడానికి నిర్దేశించింది. ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కళాశాలలు కలిపి మొత్తం 2,742 ఉన్నాయి. వీటిల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు యూత్, ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి వాటి ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. విద్యార్థి దశలోనే పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో వారిలో మార్పు వస్తుందనేది ప్రభుత్వ ఆలోచన. గతంలోనూ ఈ కార్యక్రమాలను నిర్వహించారు. తాజాగా ప్రస్తుత విద్యాసంవత్సరంలోనూ దీని అమలుకు అవసరమైన నిధులు రాష్ట్ర సమగ్ర శిక్షా ద్వారా విడుదల చేసింది.

**వినియోగం ఇలా..** నిధులను మూడు రకాల కార్యక్రమాలకు వెచ్చించాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. నీరు, నేల, గాలి, శక్తి, వ్యర్థం నుంచి అర్థంకు సంబంధించిన అయిదు జట్లు ఏర్పాటు చేయాలి. ఒక్కో జట్టులో పది మంది విద్యార్థులు ఉండాలి. వాటర్ హార్వెస్టింగ్, వృథా నీటిని ఉపయోగంలోకి తేవడం, నీటిని పొదుపుగా వాడటం, నిల్వ ఉంచడం, శుభ్రం చేయడం వంటివి ఉంటాయి. నేల, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచడం, హరితహారం పెంపునకు



చర్యలు, పాఠశాలల్లో పచ్చదనం, కిచెన్‌గార్డెన్ నిర్వహణ, పూలు, పండ్ల మొక్కల పెంపకం, వినాయక చవితి పండగకు మట్టి గణపతుల తయారీ, బ్యానర్లు, పర్యావరణ దినోత్సవం, ఓజోన్ పొర, ధరిత్రి, నీటి దినోత్సవాల నిర్వహణ, వ్యాసరచన, క్విజ్, పోస్టర్ మేకింగ్, నినాదాలు రాయడం, తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందించేందుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉంటుంది.

**రూ.9.84 కోట్లు విడుదల**

ప్రాథమిక పాఠశాలలకు రూ.3 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు, కళాశాలకు రూ.5 వేల చొప్పున కేటాయించారు. వీటిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఖాతాల్లో జమ చేశారు. ఈ నిధులను ఆయా కమిటీల భాగస్వామ్యంతో ఖర్చు చేయాల్సి ఉంటుంది.

# అనుమతులు సున్నా..!

భానుపురి : జిల్లాలోని పురపాలికల్లో వాటర్‌ప్లాంటు నిర్వాహకులు నమూనాలు పాటించడం లేదు. దీంతో శుద్ధ జలాలు అందక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి గుర్తింపు లేకుండా యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. వాస్తవానికి ఐఎస్ఐ(ఇండియన్ స్టాండర్డ్ ఇనిస్టిట్యూట్) గుర్తింపు తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇలాంటి నిబంధనలు పాటించడం లేదు. పదుల సంఖ్యలో మాత్రమే అనుమతులున్నాయి.

**57 ప్లాంట్లకే అనుమతులు..**

జిల్లాలోని ఐదు పురపాలికల్లో 357 వాటర్ ప్లాంటులు ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు 55 ప్లాంట్లకు మాత్రమే అనుమతులు తీసుకున్నారు. మిగతావి ఎలాంటి అనుమతులు పొందకుండా నిర్వహణ చేపడుతున్నారు. గతంలో రెవెన్యూ, పురపాలిక, పోలీసు అధికారులు దాడులు చేసేవారు. ఇప్పుడు రెవెన్యూ, పురపాలికలను బాధ్యతలు



అప్పగించారు. కానీ పట్టణాల్లో ఎలాంటి తనిఖీలు చేపట్టం లేదు.

**పరిశుభ్రత కరవు..**

ప్లాంట్ల నిర్వాహకులు పరిశుభ్రత పాటించడం లేదు. ఇష్టానుసారంగా నీటిని శుద్ధి చేసి విక్రయిస్తున్నారు. కనీసం లవణాల శాతం ఎంత ఉంది అనికూడా పరీక్షించడం లేదు. స్వచ్ఛమైన నీటిగా మార్చేందుకు సోడియం బయోసల్ఫైడ్‌ను వినియోగిస్తున్నారు. ఇది ప్రాణ మూలకాలను హరిస్తుంది. దీనికితోడు 20 లీటర్ల క్యాన్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు తీసుకుంటుండగా, లీటర్‌కు నీటికి రూ.5 విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టి స్వచ్ఛ నీటిని అందించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

**అనుమతి తప్పనిసరి..-వేణుమాధవరావు, ఆర్డీవో సూర్యాపేట**

పురపాలికల్లో ఏర్పాటు చేసుకొనే వాటర్ ప్లాంట్లకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. నిబంధనల ప్రకారం నడుచుకోకుంటే చర్యలు తప్పవు. ఇప్పటికైనా యజమానులు ముందుకు రావాలి.

# 'అప్పు'డు.. ఇప్పుడు.. అదేతీరు!

ఖమ్మం: పెట్టుబడులు పెరుగుతుండటం, దిగుబడులు క్షీణిస్తుండటంతో వ్యవసాయం రోజురోజుకూ భారంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు దన్నుగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ)లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో వీటి వినియోగం అంతంతమాత్రంగానే ఉండటం విచారకరం. కేసీసీల ప్రయోజనాలపై కర్షకులకు అవగాహన కల్పించటంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరటం లేదు. బ్యాంకుల్లో ఖాతాలున్న ప్రతి రైతుకూ కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలు పూర్తిస్థాయిలో అమలవటం లేదు.

**ఖాతాదారులు లక్షల్లో.. రుణగ్రహీతలు వేలల్లో..**

పెట్టుబడులకు ఇబ్బందులు పడే రైతులకు రుణాలివ్వాలనే ఉద్దేశంతో కేంద్రం కేసీసీలు అందజేస్తోంది. ఖమ్మం జిల్లాలో 31 బ్యాంకుల ద్వారా 3,63,000 మందికి, భద్రాద్రి జిల్లాలో 34 బ్యాంకుల ద్వారా 1,73,000 మందికి కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయి. ఇవన్నీ పాతవే. ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో 71,259 రైతు ఖాతాల ద్వారానే రుణాలు అందించినట్లు బ్యాంకర్లు చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలో రుణాలు పొందిన ఖాతాల సంఖ్య 50వేలు దాటలేదు. కొత్తగా బ్యాంకు ఖాతాలు తెరిచిన అన్నదాతలకు కొన్నేళ్లుగా కేసీసీలు ఇవ్వటం లేదు. ఒకసారి కార్డు పొందితే కాలపరిమితి ఐదేళ్ల వరకు ఉంటుంది. బ్యాంకు రుణం పొందిన తర్వాత కేసీసీలను ఏటీఎం కార్డు మాదిరిగా వినియోగించుకోవచ్చు. దుక్కి దున్నటం మొదలుకొని నాట్లు, కలుపులు, ఎరువులు, పురుగుమందుల కొనుగోలు తదితర అవసరాలను బట్టి నగదు డ్రా చేసుకోవచ్చు.

**అవగాహన లేమి..**

పంటలు పండించే రైతులతో పాటు పౌల్ట్రీ, చేపలు, గేదెల పెంపకం, సహకార సంఘాల సభ్యులూ కేసీసీలను పొందటానికి అర్హులు. కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచింది. వీటిపై 3% వడ్డీ రాయితీ కొనసాగిస్తున్నట్లు తెలిపింది. కేసీసీల ప్రయోజనాలపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవటంతో సింహభాగం రైతులు సద్వినియోగం చేసుకోవటం లేదు. బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారుల నిర్లక్ష్యమూ మరో కారణం. తద్వారా రైతులు తెలిసిన వారి నుంచి అధిక వడ్డీలకు అప్పులు చేస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు.

బ్యాంకుల నుంచి తీసుకునే ఇతర అప్పుల కంటే కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పొందే రుణాలకు తక్కువ వడ్డీ పడుతుందని బ్యాంకర్లు చెబుతున్నారు. తనఖా లేకుండానే రూ.2 లక్షల వరకు కేసీసీలు పొందవచ్చుననే నిబంధనా ఎక్కడా అమలవటం లేదని సమాచారం. పంటల సాగుకు తక్కువ వడ్డీకి రుణాలందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణపరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంచింది. వీటి ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

# జన ఔషధి.. అవగాహనే పరమావధి

జన్నారం : ప్రస్తుత పరిస్థితుల్లో అనేక మంది ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. అందుకు కావలసిన మందులను ప్రతి రోజు వాడాల్సిందే. బీపీ, మధుమేహం, చెడు కొలెస్ట్రాల్‌ను నిరోధించేందుకు వాడే మాత్రల ధర ప్రతి నెల రూ.వేలల్లోనే ఉంటుంది. అయితే ఎనిమిది నెలల క్రితం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలు పేదలకు వరంగా మారాయి. మంచిర్యాల జిల్లాలో జన్నారం, చెన్నూరులో వీటిని ఏర్పాటు చేశారు. గత ఏడాది జులైలో జన్నారంలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రానికి దీర్ఘకాలిక వ్యాధి బారిన పడిన వారు వెళ్లి నెలకు సరిపడా మాత్రలు కొనుగోలు చేస్తున్నారు. మధుమేహానికి వాడే ఒక మాత్రల ప్యాకెట్ ధర బయట మార్కెట్‌లో రూ.292 కాగా ఔషధి కేంద్రంలో అదే మందు బిళ్ల రూ.26కే లభిస్తుండటంతో చాలా మంది మొగ్గు చూపుతున్నారు. ప్రతీనెల రూ.2 వేలు ఆదా అవుతున్నాయి– బి.నర్సింగరావు, జన్నారంకొంతకాలంగా మధుమేహం, బీపీ, కొన్ని ఇతర దీర్ఘకాలిక రోగాల కోసం మందులు కొనుగోలు చేస్తున్నా. జన్నారంలో ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రం ఏర్పాటయ్యాక 50 శాతం డబ్బులు ఆదా అవుతున్నాయి. గతంలో రూ.4 వేలు చెల్లించి కొనుగోలు చేసిన అన్ని రకాల మందులు ఇక్కడ రూ. 2 వేలకే లభిస్తున్నాయి. సద్వినియోగం చేసుకోవాలి– కడ అనిల్, జన్నారం కేంద్రం నిర్వాహకుడు మాది జన్నారం మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామం.

# ఎవరొస్తున్నారో.. ఏం చేస్తున్నారో..?

హైదరాబాద్ : రాజధానిలోని కొన్ని గేటెడ్ కమ్యూనిటీలు నేరగాళ్లకు.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. నిందితులు అజ్ఞాతంలో ఉండేందుకు ఇక్కడే తిష్ఠ వేస్తున్నారు. ఇటీవల గచ్చిబౌలిలోని పబ్బు దగ్గర పోలీసులపై కాల్పులు జరిపిన ప్రభాకర్ గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఓ గేటెడ్ కమ్యూనిటీలోని ఫ్లాటులో ఉండడం ఆశ్చర్యపరిచింది. 80కిపైగా చోరీలు చేసిన నిందితుడి ఫ్లాట్‌లో 3 దేశవాళీ తుపాకులు, 450 తూటాలు దొరికాయి. ఏడాదిన్నర కాలంగా ఉంటున్నా స్థానికులెవరూ గుర్తించలేకపోయారు.

**పేకాట డెన్‌లు.. డ్రగ్స్ పార్టీలు**

గేటెడ్ కమ్యూనిటీల్లో కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. లోనికి ప్రవేశించాలంటే యజమాని అనుమతి తప్పనిసరి. దీన్నే నేరగాళ్లు అవకాశంగా తీసుకుంటున్నారు. తాము అజ్ఞాతంలో ఉండేందుకు అద్దె ఎంతైనా చెల్లించి నకిలీ గుర్తింపులతో ఉంటున్నారు. ఉదాహరణకు నగరంలోనే ఖరీదైన గేటెడ్ కమ్యూనిటీలో వందలాది ఫ్లాట్లు ఉన్నాయి. సగటున 70శాతం మంది అద్దెకు ఉంటున్నవారే. వీరు స్థిరనివాసం కాకుండా వారాంతాల్లో స్నేహితులతో సరదాగా గడిపేందుకు.. పార్టీలు చేసుకోవడానికి వస్తున్నట్లు గుర్తించారు. కొన్నిసార్లు వ్యభిచారం జరుగుతోందని తెలిపారు.

**పోలీసులకూ సవాల్**

ఇందులో ఉండే నేరగాళ్లను పట్టుకోవడం పోలీసులకు సవాలుగా



మారుతోంది. భద్రతా సిబ్బంది గేటు దగ్గరే ఆపేస్తున్నారు. కొందరు నేరగాళ్లు భద్రతా సిబ్బందిని మచ్చిక చేసుకొని.. కొత్తవారు, పోలీసులు వచ్చినా తెలిసేలా చూసుకుంటున్నారు. కొన్ని గేటెడ్ కమ్యూనిటీల్లో లిఫ్టులు యజమానులు, అతిథులు, మెయింటెనెన్స్ సిబ్బందికి వేర్వేరుగా ఉంటాయి. పోలీసులు సర్వీస్ లిఫ్టుల్లో వెళ్లాల్సి ఉంటుంది. గేటు దగ్గర సిబ్బంది అడ్డగింత, లిఫ్టుల దగ్గర జాప్యం.. ఫ్లాటు కనుక్కునేలోపు నిందితులు తప్పించుకున్న సందర్భాలున్నాయి.

**కక్కలేక.. మింగలేక**

కొన్ని గేటెడ్ కమ్యూనిటీల సంఘాల పరిస్థితి కక్కలేక మింగలేక అన్నట్లుగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు జరిగినట్లు తెలుస్తున్నా.. ప్రతిష్ఠ దెబ్బతింటుందని మౌనం వహిస్తున్నాయి. ఐటీ కారిడార్‌లో ఉండే ఓ గేటెడ్ కమ్యూనిటీ దగ్గర వారానికి కనీసం రెండు మూడు ఆందోళనలు జరుగుతుంటాయి.


రాయదుర్గం ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి ఒడిశాకు చెందిన ఓ వివాహితకు డబ్బు ఆశచూపి సరోగసి కోసం ఒప్పించి తీసుకొచ్చాడు. ఆమెను తన ఇంట్లో ఉంచాడు. సరోగసి ఇష్టంలేని వివాహిత పారిపోయే క్రమంలో అపార్టుమెంటు మీద నుంచి కిందపడి మరణించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ఇటీవలి ఉదంతాలు: మాదాపూర్ విఠల్‌రావునగర్‌లోని ఒక అపార్టుమెంట్ల సముదాయంలో టీజీ న్యాబ్ సోదాలు నిర్వహించి డ్రగ్స్ పార్టీ గుట్టు రట్టు చేసింది. ఈ కేసులో సినీ పరిశ్రమకు చెందిన కొందరు చిక్కారు.

ఘట్‌కేసర్ పరిధిలోని కాచవాణి సింగారం గ్రామంలోని గేటెడ్ కమ్యూనిటీలో విల్లాను నలుగురు అద్దెకు తీసుకున్నారు. ఆబ్కారీ శాఖ అధికారులు తనిఖీలు చేసినప్పుడు.. ఆ ఇంట్లో ఆల్ప్రాజోలం తయారుచేస్తున్నట్లు బయటపడింది.

# రచనా వ్యాసంగం.. సేవా మార్గం

చౌటుప్పల్ :మండలంలోని తంగడపల్లికి చెందిన ముటుకుల్లోజు వెంకటేశ్వరాచారి(ఎమ్వీచారి) ఆర్టీసీ నార్కట్‌పల్లి డిపోలో ట్రాఫిక్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్వర్ణకార కుటుంబానికి చెందిన ఆయన అరవయ్యేళ్ల వయసులోనూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే సొంతూళ్లో కులవృత్తిని, సామాజిక సేవలను కొనసాగిస్తున్నారు. 37ఏళ్ల ఉద్యోగ జీవితంలో కోదాడ డిపోలో 2001లో ఉత్తమ కండక్టర్‌గా, 2021లో నార్కట్‌పల్లి డిపోలో ఉత్తమ కంట్రోలర్‌గా పురస్కారాలు అందుకున్నారు. ఆర్టీసీ ఉద్యోగుల ఐకాస కన్వీనర్‌గా పనిచేసి గుర్తింపు పొందారు. ఆర్టీసీలో ఎస్‌డబ్ల్యూయూ(ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకే నిద్రలేచి.. కాలకృత్యాలు తీర్చుకున్నాక అరగంట వ్యాయామం చేస్తారు. వృత్తికోసం తెరిచిన దుకాణానికి వెళ్లి శుద్ధిచేసి పూజ నిర్వహిస్తారు. అక్కడే కూర్చుని రోజుకో 'మంచిమాట' రాస్తారు. 2000లో కోదాడ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న రోజుల్లో తన అధికారి పేరులోని



మొదటి అక్షరాలతో వరుస క్రమంలో అతని గుణగణాలను వర్ణిస్తూ సన్మానపత్రాన్ని రచించారు. దీంతో సన్మాన పత్రాలు లేఖకుడిగా పేరు సంపాదించారు. మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, వీరేశం తదితరులకు తాను రాసిన సన్మానపత్రాలను వివిధ సందర్భాల్లో బహూకరించారు. దీన్ని గుర్తించిన కామన్ డయాస్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ 'ప్రశంసాపత్రాల రూపశిల్పి' బిరుదును హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రదానం చేసింది. ఇప్పటికీ 300లకు పైగా సన్మానపత్రాలను రచించారు. సొంతూళ్లో 'సేవ' పేరుతో సంస్థను స్థాపించి.. స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉద్యోగ జీవితానుభవాలను 'నేనెరిగిన నిజం' పేరుతో అక్షరబద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరున ఆవిష్కరించనున్నారు. ఆర్టీసీ నార్కట్‌పల్లి డిపోలో 1987లో కండక్టర్‌గా ఉద్యోగంలో చేరిన ఆయన ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

# ఇక ఇంటింటికీ శుద్ధ జలం



పెద్దపల్లి : ఇంటింటికీ శుద్ధ జలం అందించేందుకు మిషన్ భగీరథ పథకంలో భాగంగా నిర్మించిన రక్షిత తాగునీటి పథకాలు పలు గ్రామాల్లో వృథాగా మారాయి. చిన్న చిన్న పనులు పూర్తి కాక, మరమ్మతులకు నిధులు లేక ట్యాంకులు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అసంపూర్తి ట్యాంకులతో నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నా ఇబ్బందులు తప్పడం లేదు. మూడేళ్లుగా ప్రజాప్రతినిధులు చేస్తున్న ఫిర్యాదులు బుట్టదాఖలయ్యాయి. ఎట్టకేలకు అసంపూర్తి పథకాలను వినియోగంలోకి తెచ్చేందుకు నిధులు మంజూరయ్యాయి. దీంతో నీటి కష్టాలు తొలగనున్నాయి.

**పర్యవేక్షణతోనే నాణ్యత**

మిషన్ భగీరథ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తోంది. లీకేజీల సమస్య వెంటాడుతోంది. నాణ్యత పాటించక నిర్మించిన కొన్నాళ్లకే పగుళ్ల బారిన పడుతున్నాయి. లీకేజీలతో తాగునీరు కలుషితం కావడంతో తాగేందుకు ప్రజలు వెనుకాడుతున్నారు. ఇటీవల మంజూరైన నిధులతో చేపట్టే పనులపై పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉంది.

**అదనంగా 28 ట్యాంకుల నిర్మాణం**

జిల్లాలో మిషన్ భగీరథ పథకంలో 362 రక్షిత తాగునీటి పథకాలు నిర్మించి కనెక్షన్లు ఇచ్చారు. కొన్ని చోట్ల నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడటంతో మూడేళ్ల కిందట అదనంగా 28 ట్యాంకులు నిర్మించారు. ట్యాంకు నుంచి పైపులైన్‌కు కనెక్షన్లు ఇవ్వడంతో పాటు ఇతర చిన్న చిన్న పనులు చేపట్టాల్సి ఉంది. నిధులు సమస్యతో వదిలేశారు. అసంపూర్తి పనులు పూర్తి చేయాలంటూ స్థానిక ప్రజాప్రతినిధులు ప్రతి సమావేశాల్లో ఫిర్యాదు చేసినా మోక్షం కరవైంది. నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిరీక్షణ తప్పలేదు.

**ప్రత్యామ్నాయాలతో తీరని అవసరాలు**

మంథని, రామగిరి, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, కాల్వశ్రీరాంపూర్ మండలాల పరిధిలో 28 ట్యాంకులకు సంబంధించిన అసంపూర్తి పనులకు రూ.4.86 కోట్లతో ప్రతిపాదించగా ఎట్టకేలకు మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. దీంతో మూడేళ్ల నిరీక్షణకు తెరపడింది. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు ప్రత్యామ్నాయంగా పాత నీటి పథకాలతో సరఫరా చేస్తున్నా ప్రజల అవసరాలు పూర్తి స్థాయిలో తీరడం లేదు. చేతి పంపులు, బోరుబావుల నుంచి నేరుగా సరఫరా చేసిన నీటిని తాగాల్సి వస్తోంది. తాజాగా మంజూరైన నిధులతో ప్రజలకు శుద్ధ జలం అందనుంది.

**త్వరలోనే పనులు ప్రారంభిస్తాం**జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా గతంలో నిర్మించిన అదనపు ట్యాంకుల్లో అసంపూర్తిగా నిలిచిన పనులకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం టెండరు దశలో ఉండగా త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. నిర్మాణాల్లో నాణ్యత పాటిస్తాం. ప్రజలకు పూర్తి స్థాయిలో శుద్ధ జలం అందించనున్నాం. –శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ

# వంద రోజులు అందని ఉపాధి



కరీంనగర్ : రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో గత ఆర్థిక సంవత్సరం (2023-24) 144 కుటుంబాలకు 100 రోజులపాటు పని దొరికింది. ఈ ఏడాది (2024-25) మాత్రం కేవలం 20 మంది మాత్రమే వంద రోజులపాటు పని అందుకోగలిగారు. కిందటేడాది జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో 146 కుటుంబాలకు పని లభించగా ఈసారి కేవలం 8 కుటుంబాలకే దక్కింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో గతేడాది 442 కుటుంబాలకు లబ్ధి అందగా ఈసారి 149తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పెద్దపల్లి జిల్లా మంథని, ముత్తారం మండలంలో గతేడాది 98 కుటుంబాలు 100 రోజుల పని పొందలేదు. ఈ ఏడాది ఇప్పటివరకు 12 కుటుంబాలు మాత్రమే పనిని పొందాయి.

**క్రమంగా తగ్గుతూనే..**

2021-22 సంవత్సరంలో నాలుగు జిల్లాల పరిధిలో ఏకంగా 27,635 కుటుంబాలకు 100 రోజుల పని లభించింది. కరోనా విపత్తు ఎక్కువగా ఇబ్బంది పెట్టిన 2022-23 సంవత్సరంలోనూ 4,340 కుటుంబాలు ఈ లక్ష్యాన్ని చేరుకున్నాయి. గడిచిన రెండేళ్లుగా మాత్రం పనుల్లో అనుకున్న పురోగతి లేక కూలీలు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 5.09 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులున్నాయి. ఇందులో 9.49 లక్షల మంది కూలీలున్నారు. వాస్తవానికి పనికి వెళ్లే కుటుంబాలు 3.27 లక్షలున్నాయి. ఇందులోని 4.95 లక్షల మంది కూలీలు ఈ పథకాన్ని సద్వినియోగపర్చుకుంటున్నారు. పనికి వెళ్లే కుటుంబాల్లో కనీసం 8-10 శాతం మంది అయిదేళ్ల కిందట శతశాతం ప్రగతిని పని కల్పన పరంగా అందుకునేవారు. ఇప్పుడా పరిస్థితి పల్లెల్లో కనిపించడం లేదు.

**ఎందుకిలా?** గ్రామాల్లో ఉపాధి హామీ పనుల అంచనాలు మొక్కుబడిగా కొనసాగుతుండటంతో అనుకున్న విధంగా ఏడాది పొడవునా కూలీలకు పని లభించడం లేదు. వాస్తవానికి పనికి వెళ్లిన ప్రతి ఒక్కరికి ఏడాది కాలంలో కనీసం 100 రోజులకు తగ్గకుండా పనిని అందించాలన్నది ఈ పథకం ఉద్దేశం. కాని ఇలాంటి కుటుంబాలు కాలక్రమేణా తగ్గిపోతున్నాయి. ఎక్కువ మొత్తంగా పనులను ఎంపిక చేయకపోవడం, చిన్నచిన్న పనులను మాత్రమే ఈ పథకంలో చేపడుతుండటంతో కూలీలకు నష్టం వాటిల్లుతోంది. గ్రామాల్లో పని చేసేవారు సమృద్ధిగా ఉన్నా.. కొందరిని మాత్రమే ఎంపిక చేసి పని ప్రదేశాలకు పంపుతున్నారు. గతంలో ఒక్కో గ్రామంలో సగటున 200-300 మంది పని చేసే విధంగా చెరువుల మర్మతులు, కట్ట వెడల్పులాంటి పెద్దపెద్ద పనులు ఉండగా ఇప్పుడు సగటున 50-60 మందికి చెట్లకు నీళ్లు పోయడం, గుంతలు తీయడం లాంటి చిన్న పనులు చేపడుతున్నారు. దీంతో అనుకున్న లక్ష్యానికి దూరంగా కూలీలు పని చేయాల్సి వస్తోంది.

# అక్రమ నిర్మాణాలపై దృష్టి

సూర్యాపేట : ఆస్తి పన్ను సవరణకు పుర అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోనున్నారు. పురపాలికల్లో కొందరు ఒక ఇంటి అనుమతి తీసుకొని పైన మూడునాలుగు అంతస్తులు నిర్మిస్తుంటారు. దీంతో పురపాలిక పన్నులు చెల్లించకుండా ఉంటున్నారు. దీంతో పుర ఆదాయానికి గండి పెడుతున్నారు. ఇలాంటి వాటిని సవరించేందుకు నడుం బిగించారు. మూడేళ్ల క్రితం భువన్ యాప్ ద్వారా ఇళ్లను గుర్తించారు. ప్రస్తుతం రికార్డుల్లో ఉన్న వివరాలతో క్షేత్రస్థాయి పరిస్థితులు సరిపోవటం లేదు. వాటిపై ప్రస్తుతం దృష్టిసారిస్తున్నారు.

**5 పురపాలికల్లో పన్ను వసూలు**

జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి పురపాలికలు ఉన్నాయి. వీటిలో ఇంటికి సంబంధించిన పూర్తి వివరాలు, మొత్తం విస్తీర్ణం, ప్లాటు విస్తీర్ణం, ఎంత మేర నిర్మించారు. ఖాళీ స్థలం ఎంత ఉన్నది, యజమాని పేరు, ఇంటి నంబరు, కాలనీ పేరు తదితర వివరాలను నమోదు చేసి ఆ వివరాలు 'సీడీఎంఏ' లాగిన్‌లో వెళ్లి అక్కడి నుంచి కమిషనర్ పరిశీలన పూర్తి కాగానే కొత్త పన్నులు వసూలు చేస్తారు.

**ఇలా గుర్తింపు..**పురపాలికల్లో మొదట పై అంతస్తు ఉన్న ఇళ్లను పక్కాగా గుర్తిస్తారు. ఆ ఇంటికి మార్కింగ్ వేసి పురపాలికల్లో ఉన్న కొలతలు,



ఆ తర్వాత నిర్మించిన ఇళ్లను గుర్తిస్తారు. పై అంతస్తులు నిర్మించిన వాటికి కొలతలు వేసి వెంటనే ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటారు. ఆ తర్వాత అంతర్జాలంలో నమోదు చేస్తారు. రికార్డుల్లో లేని వాటికి సంబంధించి పన్నులు నమోదు చేస్తారు. 2025-26 సంవత్సరానికి ఆస్తి పన్ను మదింపు చేసి డిమాండు నోటీసులు ఇవ్వనున్నారు. చర్యలు తీసుకుంటాం–శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట పురపాలికల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. పన్నుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే నోటీసులు జారీ చేసి శాఖాపరమైన చర్యలు తప్పవు. అనుమతుల ప్రకారమే ఇళ్లను నిర్మించుకోవాలి.

# దైవ సన్నిధిలో ఇదేం బేరం

నీలగిరి : దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయను రూ.40కి అమ్ముతున్నారు. బయట రూ.20-25గా ధర ఉందని అడిగితే కసురుకుంటున్నారని ఓ భక్తురాలు తన ఆవేదన వ్యక్తం చేసింది. చెర్వుగట్టులో అమావాస్యరోజు నిద్రకు పోయాను. కొబ్బరికాయలకు కొన్ని వస్తువులు అవసరం లేకున్నా జతచేసి రూ.50 వరకు అమ్ముతున్నారు. ఇక్కడ ధరల బోర్డులు కనిపించడం లేదు. ఉన్నవాటి గురించి అడిగితే పాతవని అంటున్నారని ఓ భక్తుడు వాపోయాడు. తమ మొక్కులు తీర్చుకోవాలని భక్తులు కుటుంబ సమేతంగా దైవదర్శనాలకు వెళ్తుంటారు. దేవాలయాల దగ్గర ధరలు చూసి ఇంతేంటి అని భక్తులు అడిగితే దేవుని వద్ద బేరాలేందీ సారూ..! అంటూ నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించే ఆలయాల వద్ద భక్తులకు పూజా సామగ్రి అమ్మకం పేరుతో వ్యాపారుల దోపిడీ జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించి కొబ్బరికాయలు, లడ్డూ, పూలు, పండ్లు అమ్ముకోవడానికి హక్కులు



కల్పించి సూచించిన ధరల పట్టికను ఏర్పాటు చేయిస్తారు. కానీ వ్యాపారులు తెలివి ప్రదర్శించి పూజా సామగ్రి పేరుతో ఒకటి, రెండు వస్తువులను అదనంగా ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.20-30కి లభించే కొబ్బరికాయను కొన్ని వస్తువులు జతచేసి రూ.40-50 వరకు అమ్ముతున్నారు. ఈ వ్యవహారమంతా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని భక్తులు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో 800పైగా ఆలయాలను గుర్తించారు. ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించే గుళ్లు వందకు పైగా ఉంటాయి. చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయానికి ప్రతి సోమవారం, అమావస్య రోజున భక్తులు వేలాది మంది వస్తుంటారు. దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం, కోట మైసమ్మ ఆలయం, మత్స్యగిరి లక్ష్మీనరసింహాస్వామి, మేళ్లచెర్వు శివాలయం, మఠంపల్లి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం తదితర చోట్ల భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. చెర్వుగట్టు ఆలయంలో దర్శనం టికెట్, లడ్డు, పులిహోర టికెట్ల అమ్మకంలోను మోసాలు జరుగుతున్నాయని భక్తులు వాపోతున్నారు. చెర్వుగట్టు, దర్వేశిపురం ఆలయాల వద్ద హక్కులు దక్కించుకున్న వ్యాపారులు ధరల పట్టికలను ఏర్పాటు చేయడం లేదు. దీంతో చేసేదీమీ లేక భక్తులు వారు చెప్పిన ధరలకు కొంటున్నారు.

**విచారించి చర్యలు తీసుకుంటాం**

– భాస్కర్, సహాయ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయశాఖ నల్గొండ వ్యాపారులు అధిక ధరలకు అమ్మకుండా ధరల పట్టికలు ఏర్పాటు చేయిస్తాం. భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం. ఆలయాల్లో సమస్యలపై భక్తులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

# జోరుగా ఉపాధి పనులు

నిర్మల్ : సాగు పనులు పూర్తికావడంతో కూలీలకు ఉపాధిహామీ పథకం ఆర్థిక చేయూతనిస్తోంది. ఈనెల ప్రారంభం నుంచి కూలీల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పనులు చేయడంలో నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో మహిళలు అత్యధికంగా ముందంజలో ఉన్నారు. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పురుషులు ఆధిక్యంలో ఉన్నారు. పనుల్లో అవకతవకలను అరికట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే నూతన సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. క్షేత్ర సహాయకులు ఉదయం పనులకు వచ్చిన వారి ఫొటో తీసి నేషనల్ మస్టర్ మానిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్) పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత మరో దఫా చరవాణిలో చిత్రం తీసి మళ్లీ అందులో పొందుపర్చేలా మార్గనిర్దేశం చేశారు. ఈ విధానంతో పనులకు ఎందరు వచ్చారనేది బృందంలోని సభ్యులందరికీ తెలియడంతోపాటు ఉన్నతాధికారులు నేరుగా పరిశీలించే అవకాశం కలిగింది.

**పెద్ద మొత్తంలో..**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు జోరందుకున్నాయి. ప్రభుత్వ సూచనల మేరకు చేసిన వాటినే మళ్లీ చేయకుండా కొత్త వాటికి ప్రాధాన్యమివ్వాలని ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు గుట్టలపై భాగం, కింద ఇంకుడు గుంతలు, చిన్న చిన్న నీటి కుంటల నిర్మాణం పనులు చేపడుతున్నారు. సాగు యోగ్యంగా లేని బీడు భూముల చదును, వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లేందుకు మట్టిరోడ్లు వంటివి చేస్తున్నారు. నాలుగు జిల్లాల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో 8,396 కుటుంబాలు వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్నాయి.



ప్రతి ఒక్కరికీ పని–విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్

పనులు కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ వెంటనే కల్పిస్తున్నాం. జాబ్‌కార్డులు త్వరితగతిన జారీ చేసేలా చర్యలు తీసుకున్నాం. క్షేత్ర సహాయకులను సంప్రదిస్తే వివరాలు నమోదు చేసుకుని సంబంధిత కూలీలకు పనులు చూపనున్నారు. అవసరమైన పనులకు మొదటి స్థానం కల్పిస్తూ వాటిని చేపడుతున్నాం. విస్తారంగా వర్షాలు కురుస్తున్నా.. వేసవిలో పలు చోట్ల నీటి ఎద్దడి నెలకొంటోంది. ఈ సమస్యను అధిగమించేందుకు నీటిని ఒడిసి పట్టేందుకు భారీ, చిన్న చిన్న ఇంకుడు గుంతలు, నీటి నిల్వ కుంటలు వంటివి నిర్మిస్తున్నాం. సాగు పనులు పూర్తి కావడంతో ప్రస్తుతం పెద్ద సంఖ్యలో కూలీలు వస్తున్నారు.

# డబ్లింగ్, విద్యుదీకరణ పనులు

హైదరాబాద్ : రైల్వే ప్రయాణాల్లో కీలకంగా మారనున్న లాలాగూడ – సీతాఫల్‌మండి 'కార్డ్‌లైన్', సీతాఫల్‌మండి – మౌలాలి 'డబ్లింగ్, విద్యుద్దీకరణ' పనులు మార్చి నెలాఖరుకల్లా పూర్తికానున్నాయి. ఏడాది క్రితం ఈ పనులు చేపట్టగా 40 రోజుల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు ద. మ.రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ ట్రాక్‌లు అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్ స్టేషన్‌తో అనుసంధానమైన ఉన్న మెయిన్‌లైన్లపై ఒత్తిడి తగ్గుతుంది. సీతాఫల్ మండి, మల్కాజిగిరి స్టేషన్లను బైపాస్ చేస్తూ కాచిగూడకు రైళ్లను మళ్లించొచ్చు. సింగిల్‌ట్విన్‌లైన్ల ద్వారా మల్కాజిగిరి మార్గంలో మరిన్ని ఎంఎంటీఎస్ రైళ్లను నడిపేందుకు ఆస్కారం ఏర్పడనుంది.

**కార్డ్‌లైన్‌తో నేరుగా కాచిగూడకు...**

సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, గూడ్స్, ఎంఎంటీఎస్ రైళ్ల ట్రాఫిక్‌తో స్టేషన్‌పై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. దీంతో దక్షిణ మధ్య రైల్వే 4 కిలోమీటర్ల మేర లాలాగూడ – సీతాఫల్‌మండి 'కార్డ్‌లైన్', 10 కిలోమీటర్ల మేర సీతాఫల్‌మండి – మౌలాలి 'డబ్లింగ్, విద్యుద్దీకరణ'



పనులను చేపట్టింది. ఈ కొత్త మార్గాల ద్వారా పలు గూడ్స్, ఎక్స్‌ప్రెస్‌రైళ్లతో పాటు కొన్ని రైళ్లను కాచిగూడకు నేరుగా మళ్లించడంతో పాటు మరికొన్నింటిని ఇతర స్టేషన్లలో నిలిపి, ఎంఎంటీఎస్ ప్రయాణాలను మెరుగుపరచవచ్చు. కాజీపేట–చర్లపల్లి– మౌలాలీ మీదుగా ప్రయాణించే రైళ్లన్నీ మల్కాజిగిరి – సీతాఫల్‌మండి స్టేషన్లను బైపాస్ చేస్తూ కాచిగూడ – బెంగళూరు లైన్ మీదుగా కాచిగూడకు చేరుకునేలా వెసులుబాటు కల్పించారు. దీంతో ప్రయాణ సమయం 30 నిముషాలు ఆదా అవుతుంది.

**గంట సమయం ఆదా..**

గతంలో గుంటూరు, విజయవాడ మీదుగా వచ్చే రైళ్లను నిజామాబాద్, నాందేడ్ వైపు వెళ్లే రైళ్లను మళ్లించేందుకు సికింద్రాబాద్ స్టేషన్‌లో హాల్టింగ్, ఇంజిన్ మార్పుకోసం పడే ప్రయాసలు అన్నీ ఇన్నీ కావు. అందుబాటులోకి రానున్న కార్డ్‌లైన్ ద్వారా సికింద్రాబాద్‌కు వెళ్లకుండా.. ఇంజిన్ మార్చుకొనే అవసరం లేకుండా నేరుగా దయానంద్‌నగర్ చేరుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇందుకోసమే దయానంద్‌నగర్‌లో 24 కోచ్‌లకు సరిపడా ప్లాట్‌ఫామ్‌ను నిర్మిస్తున్నారు. తాజా మార్గాలు అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు ఖాళీ లేక బయటే రైళ్లను నిలిపే ప్రయాస తప్పుతుంది.

# స్వయం ఉపాధి శిక్షణలో సెట్‌విన్

హైదరాబాద్: ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థికంగా అండ లేని యువతకు.. సాంకేతిక విద్యను అభ్యసించినా నైపుణ్యంలేని విద్యార్థులకు.. వివాహమై ఏదో ఒక పనిచేసి కుటుంబానికి ఆసరాగా ఉండాలని పరితపించే అతివలకు.. డిమాండ్ ఉన్న రంగాల్లో పట్టు సాధించాలకునే యువకులకు అండగా నిలుస్తోంది ప్రభుత్వరంగ సంస్థ'సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ అండ్ ట్రైనింగ్ ఇన్ ట్విన్ సిటీస్(సెట్విన్)'. నామమాత్రపు ఫీజులతో, సుశిక్షితులైన ఫ్యాకల్టీతో ఏటా సుమారు 20వేల మందికి శిక్షణ ఇస్తోంది. 1978లో ప్రారంభమైన ఈ సంస్థకు నగరంలో ప్రస్తుతం 19 కేంద్రాలు ఉన్నాయి. కోర్సులు, ఫీజుల వివరాలుమార్కెట్‌లో డిమాండ్ ఉన్న కంప్యూటర్ బేసిక్స్, పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్, డీటీపీ, సీ లాంగ్వేజ్, మొబైల్ రిపేరింగ్, డీజిల్ మెకానిక్, సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, సోలార్ టెక్నీషియన్ కోర్సుల్లో యువతకు శిక్షణ ఇస్తున్నారు. మహిళలు, విద్యార్థినులకు ప్రత్యేకంగా బ్యూటీషియన్, డిప్లొమా ఇన్ ఫ్యాషన్



డిజైనింగ్, మెహిందీ డిజైన్, టెక్స్‌టైల్ డిజైనింగ్, కుట్టు మిషన్ తదితర అంశాల్లో తర్ఫీదు లభిస్తోంది. ప్రీప్రైమరీ టీచర్ ట్రైనింగ్, క్రాఫ్ట్, కాలిగ్రఫీ, స్పోకెన్ ఇంగ్లిష్, హోటల్ మేనేజ్‌మెంట్.. ఇలా సుమారు 60 రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైనవారు కేంద్రాలను నేరుగా సంప్రదించాలి.

**సంస్థలే వచ్చి నేరుగా ఎంపిక..**

వేణుగోపాలరావు, ఎండీ, సెట్విన్

కోర్సులు పూర్తి చేసినవారికి ఉపాధి కల్పించడానికి ఓ ప్లేస్‌మెంట్ సెల్ ఏర్పాటుచేసి అధికారిని నియమించాం. పలు కంపెనీలు మావద్దకే వచ్చి అభ్యర్థుల్ని ఎంపిక చేసుకుంటున్నాయి. ఇక్కడ శిక్షణ పూర్తిచేసుకున్నవారు భవిష్యత్తులో తమ కాళ్లపై తాము నిలబడగలమనే భరోసా కల్పిస్తున్నాం'.

# ఏడాదిలో 744 ఆక్రమణల తొలగింపు




హైదరాబాద్: ట్రాఫిక్ సమస్యకు తీవ్ర ఇబ్బందిగా మారిన ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. ఆపరేషన్ రోప్ లో భాగంగా సోమవారం ట్రాఫిక్ పోలీసులతో కలిసి జీహెచ్ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి తొలగింపు ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి దోహదపడుతుంది. 2024 డిసెంబరు నుంచి 2025 జనవరి వరకు జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో కలిపి మొత్తం 744 ఆక్రమణలను అధికారులు తొలగించారు. ఈ డ్రైవ్‌లో పట్టణ ప్రణాళిక, పోలీస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో జీహెచ్ఎంసీ వెల్లడించింది. ట్రాఫిక్ సమస్య తీర్చడానికి ఇలాంటి స్పెషల్ డ్రైవ్‌లు ఇకపై తరచుగా నిర్వహిస్తామని పేర్కొంది.

# కూడళ్లు.. వీడుతున్న చిక్కుముళ్లు




హైదరాబాద్ : నగర ట్రాఫిక్ సమస్యలో నిత్యం వినిపించే కేబీఆర్ పార్కు కూడళ్ల అభివృద్ధి ప్రాజెక్టు మళ్లీ చర్చల్లోకి వచ్చింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెం.92లో తన ఇంటికి భూసేకరణ కోసం చేసిన మార్కింగ్ తప్పని సినీ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో.. ప్రాజెక్టులో పురోగతి లేకపోవడంపై శనివారం సీఎం రేవంత్‌రెడ్డి బల్దియా అధికారులకు చేసిన హెచ్చరికల నేపథ్యంలో బల్దియా భూసేకరణలో వేగం పెంచింది. ఈ క్రమంలో.. జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి రక్త నిధి కేంద్రం ప్రహరీని స్వల్పంగా తొలగించాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. జూబ్లీ చెక్‌పోస్టు కూడలిపై నిర్మించాల్సిన రెండోస్థాయి పైవంతెన కోసం రోడ్డు నెం.1ని కూడలికి ఇరువైపులా 145అడుగుల మేర విస్తరిస్తామని, అందులో భాగంగానే చిరంజీవి రక్త నిధి కేంద్రం వద్ద భూసేకరణ చేపడుతున్నట్లు జీహెచ్ఎంసీ వెల్లడించింది.

**ఇప్పటికే పలువురు ప్రముఖుల అంగీకారం..**

జూబ్లీహిల్స్ రోడ్డు నెం.92లో కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ఇల్లు, అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి ఇల్లు, రోడ్డు నెం.45 కూడలిలోని నందమూరి బాలకృష్ణ ఇల్లు, రోడ్డు నెం.1లోని అల్లు అర్జున్ భవనం, పలు మీడియా సంస్థల భవనాలు, ఇతర ప్రముఖులు, వ్యాపార వేత్తల ఆస్తులను సేకరించేందుకు బల్దియా కార్యాచరణను సిద్ధం చేసింది. మిగిలిన సర్వేని పూర్తి చేయడంతో.. తాజాగా రక్తనిధి కేంద్రం, మరిన్ని భవనాలు కూడా జాబితాలో చేరాయని అధికారులు చెబుతున్నారు. చాలా మంది భూసేకరణకు అంగీకరించారని స్పష్టం చేస్తున్నారు.

**రూ.1,200 కోట్ల సర్కారు నిధులతో..**

జూబ్లీచెక్‌పోస్టు కూడలితోపాటు ముగ్ద చౌరస్తా, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, మహారాజ అగ్రసేన్ కూడలి, ఫిల్మ్‌నగర్ చౌరస్తా, రోడ్డు నెం.45కూడళ్లలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ పైవంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. రూ.1,200 కోట్ల నిధులతో ప్రాజెక్టుకు పరిపాలన అనుమతి కూడా ఇచ్చింది.

**పురోగతిలో మార్కింగ్ పనులు**

రోడ్డు నెం.45 కూడలిలో 40, అగ్రసేన్ కూడలిలో 45, ఫిల్మ్‌నగర్ కూడలిలో 43 ఆస్తుల సేకరణకు మార్కింగ్ పూర్తయిందని, కేంద్ర కార్యాలయానికి వివరాలు అందజేశామని అధికారులు చెబుతున్నారు. జూబ్లీచెక్‌పోస్టు వద్ద 47, ముగ్ద చౌరస్తాలో 40, క్యాన్సర్ ఆస్పత్రి వద్ద 18 ఆస్తులను సేకరించాల్సి ఉందని, వాటి మార్కింగ్ పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొంటున్నారు.

**చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదుపై..**

చంద్రశేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరుపుతామని అదనపు కమిషనర్ శివకుమార్ నాయుడు తెలిపారు.అధికారులు మాత్రం.. ఆయన ఇల్లు మలుపు వద్ద ఉండటంతో ఓ వైపున ఎక్కువగా, మరో వైపున తక్కువగా తొలగించాల్సిన అవసరం తలెత్తిందని చెబుతున్నారు.

# పొదుపు.. చేనేత కార్మికుడి మదుపు



కరీంనగర్ : చేనేత వస్త్ర ఉత్పత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు, అనుబంధ కార్మికులకు ప్రభుత్వం చేయూతనిచ్చే కార్యక్రమాలు అమలు చేయడమే కాకుండా ప్రత్యేకంగా నిధులు కూడా విడుదల చేసింది. ప్రతి కార్మికుడు తాము తయారు చేసే వస్త్ర ఉత్పత్తి ద్వారా పొందుతున్న వేతనంలో కొంత డబ్బును పొదుపు చేస్తే దానికి రెట్టింపుగా ప్రభుత్వం ఆ కార్మికుల కుటుంబానికి అందజేస్తోంది. గతంలోనూ ఈ కార్యక్రమం అమలైనా తాజాగా మళ్లీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా పొదుపు విధానానికి మార్గదర్శకాలు జారీ చేసింది. దీనిని థ్రిఫ్ట్ పథకం అంటారు.

**రెండేళ్లకు అమలు..**

గత ప్రభుత్వంలో 2017లో చేనేత రంగానికి, కార్మికులకు చేయూతనిచ్చేందుకు కార్మికుడు పొదుపు చేసిన మొత్తానికి రెట్టింపు ఇచ్చేందుకు అమలు చేసింది. మూడేళ్లపాటు జమ చేసిన డబ్బుకు రెండింతలు ప్రభుత్వం కలిపి వారి అవసరాల కోసం కాలపరిమితి తీరగానే విడుదల చేసింది. ఈ ప్రభుత్వం కూడా రెండేళ్లకు అమలు చేయనుంది. ప్రతి కార్మికుడు నెలనెలా పొందే వేతనంలో 8 శాతం డబ్బు చెల్లిస్తే ప్రభుత్వం 16 శాతం కలిపి పొదుపు చేస్తోంది. మార్చి ఒకటి నుంచి అమలుకానున్న ఈ కార్యక్రమానికి క్షేత్రస్థాయి అధికారులు జిల్లాలోని చేనేత సహకార సంఘాల్లో పని చేసే కార్మికులకు ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో కార్మికులు జమ చేసిన తర్వాత నిర్లక్ష్యం చేశారనే విమర్శలు చేశారనే అపవాదు ఉంది. అందుకోసం ప్రభుత్వం చెల్లించే సహాయాన్ని పూర్తిస్థాయిలో పొందేందుకు వీలుగా కార్మికులకు అవగాహన కల్పించి ఈ పథకం వైపు ఆసక్తి చూపుతున్నారు.

గతంలో కార్మికులు ఈ పథకాన్ని పొందినప్పటికి కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 15వ తేదీ వరకు గడువు విధించారు.

**అర్హతలు ఇవి..**

కార్మికులకు తప్పనిసరిగా బ్యాంకు ఖాతాలు ఉండాలి.

18 ఏళ్లపైబడి జియోట్యాగింగ్ కలిగి ఉండాలి.

ప్రతినెలా 15వ తేదీలోగా చేనేత కార్మికుడు రూ.1200, అనుబంధ కార్మికులు రూ.600 రెండేళ్లపాటు జమ చేయాలి.

కార్మికుడు అర్ధాంతరంగా చనిపోతే ఆ డబ్బు కార్మికుడు సూచించే నామినికి లభిస్తుంది.

కార్మికులు వినియోగించుకోవాలి

జిల్లాలో పొదుపు పథకంపై చేనేత కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం. వీరందరికి మార్చిలో ఈ పథకం వర్తిస్తుంది. జిల్లాలో ఎమ్మెల్సీ కోడ్ ఉండటంతో మార్చి మూడు తర్వాత అమల్లోకి వస్తుంది. ఆలోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తాం. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.విద్యాసాగర్, సహాయ సంచాలకులు, చేనేత జౌళి శాఖ

జిల్లాలో చేనేత సంఘాలు : 21

కార్మికులు : 844

అనుబంధ కార్మికులు : 536

గతంలో లబ్ధి పొందిన మొత్తం: రూ.5.30 కోట్లు

# ఉగాది నాటికి కార్మికుడే యజమాని



సిరిసిల్ల : జిల్లాలో నేత కార్మికులను యజమానులుగా చేసే ప్రక్రియకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. దీనికోసం దరఖాస్తుల స్వీకరణ.. అర్హుల ఎంపికకు చేనేత, జౌళిశాఖ సీఎఫ్ (కమ్యూనిటీ ఫెసిలిటేటర్)లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయి. మరోవైపు మరమగ్గాల కొనుగోలు.. అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు జరుగుతోంది. తొలివిడత వెయ్యి మంది అర్హుల ఎంపిక చేయనున్నారు. ఉగాది నాటికి పథకానికి తుదిరూపు తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**వందశాతం రాయితీ.. కొత్త శకం**

లబ్ధిదారులుగా ఎంపికైన వారు పదిశాతం తమ వాటా చెల్లించాలని తొలుత నిర్ణయించారు. కానీ ఇక్కడ పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. సిరిసిల్లలోని కార్మికులు నివాసం ఉండే ప్రాంతాలు పూర్తిగా ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాల్లో ఉన్నాయి. కనీసం వీరి నివాస గృహాలపై బ్యాంకులు రుణాలు ఇచ్చే పరిస్థితిలేదు. దీనికోసం జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయ ప్రణాళికలు చేస్తోంది. కార్మికులకు వంద శాతం రాయితీపై ఈ పథకానికి ఎంపిక చేయనున్నారు. పథకంలో మరమగ్గాలు పొందిన లబ్ధిదారులకు నూలు రాయితీతో పాటు ప్రభుత్వ ప్రైవేటు ఆర్డర్లు ఇవ్వనున్నారు. ప్రైవేటు ఉత్పత్తుల విక్రయాలకు జిల్లాలోనే ప్రత్యేకంగా మార్కెటింగ్ వసతిని కల్పించేందుకు ప్రముఖ వస్త్రోత్పత్తుల సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ఈ ప్రక్రియ పూర్తయితే జిల్లా వస్త్రోత్పత్తుల్లో కొత్తశకం ప్రారంభం కానుంది.

**ఆధునిక సదుపాయాలు** సిరిసిల్ల పట్టణం పెద్దూరులో 'వర్కర్ టూ ఓనర్' పథకానికి 83 ఎకరాల్లో టీజీఐఐసీ 42 వీవింగ్, నాలుగు వార్పిన్ షెడ్లను నిర్మించింది. కాగా ప్రభుత్వం రూ.386.88 కోట్లతో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రెండేళ్ల క్రితం పనులు పూర్తయినా చేనేత, జౌళిశాఖ స్వాధీనం చేసుకోవడంలో జాప్యం జరుగుతోంది.రెండు వేల మంది కార్మికులను యజమానులుగా చేయడం ఈ పథకం ఉద్దేశం. తొలివిడత వెయ్యిమందిని ఎంపిక చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో కార్మికుడికి రూ.16.52 లక్షల విలువైన ఆధునిక ర్యాపియర్ మరమగ్గాలను అందించనున్నారు. వీటిపై చేతి రుమాలు మొదలు పట్టు వస్త్రాల వరకు ఉత్పత్తి చేసేలా ఆధునిక సదుపాయాలు అమర్చి ఉంటాయి.వీటి కొనుగోలుకు ప్రభుత్వం మరమగ్గాలు తయారు చేసే కంపెనీలతో సంప్రదింపులు జరుపుతోంది. టెండర్ల ద్వారా కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయనున్నారు.

# ఎన్టీపీసీ రెండో దశ పనులకు అడుగులు

ఖని : ఎట్టకేలకు తెలంగాణ ఎన్టీపీసీ రెండో దశ పనులకు అడుగు పడుతోంది. మొదటి దశలో 1600 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను నిర్మించగా రెండో దశ పనులపై సందేహాలు వ్యక్తమయ్యాయి. విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదరకపోవడంతో రెండో దశలో చేపట్టాల్సిన 2400 మెగావాట్ల మూడు యూనిట్ల ఏర్పాటుపై సందిగ్ధం నెలకొంది. చివరికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో రెండో దశ పనులకు ఎన్టీపీసీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఈ మేరకు బోర్డు ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణంపై మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే రెండు దఫాలుగా వాయిదా పడిన ప్రజాభిప్రాయ సేకరణను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టు నిర్మించిన మొదటి దశ ప్రాంతంలోనే రెండో దశలో నిర్మించే 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లను నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి పరిసర



గ్రామాలు, రామగుండం ప్రాంత ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేశారు.

పూర్తిస్థాయిలో అందుబాటులోకి..

రాష్ట్ర విభజన చట్టంలో రూపొందించిన విధంగా తెలంగాణకు ఎన్టీపీసీ ద్వారా 4000 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అందులో భాగంగానే మొదటి దశలో 1600 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలు నిర్మించి ఉత్పత్తిని ప్రారంభించారు. ఉత్పత్తి చేసిన విద్యుత్తును తెలంగాణ గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. కొత్తగా మరో 2400 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను కూడా నిర్మించి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతోంది. ఏటా 11.7 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేసే విధంగా సింగరేణితో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. నిర్మాణం మొదలు పెట్టిన తర్వాత నాలుగేళ్లలో 2400 మెగావాట్ల మూడు యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. మొదటి దశలో చేపట్టిన 1600 మెగావాట్ల రెండు యూనిట్లు గత ఏడాది నుంచి అందుబాటులోకి వచ్చాయి. 2016లో మొదటి దశ విద్యుత్తు కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. 2023, 2024లో రెండు యూనిట్ల పనులు పూర్తిగా వాణిజ్య ఉత్పత్తిలోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం రెండో దశలో చేపట్టే 2400 మెగావాట్ల మూడు యూనిట్లను 2030 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఎన్టీపీసీ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

**పర్యావరణవేత్తల ఆందోళన**


రామగుండంలో నిర్మించనున్న రెండో దశ విద్యుత్తు కేంద్రాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన స్థానికంగా వ్యక్తమవుతోంది. పారిశ్రామిక ప్రాంతంలో గాలి నాణ్యత దెబ్బతింటుందని పర్యావరణ వేత్తలు అంటున్నారు. సల్ఫర్ డయాక్సైడ్ గాలిలో కలిసి ప్రాణవాయువు ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 4,200 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలున్న రామగుండంలో మరో 2400 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలు నెలకొల్పడం ద్వారా పూర్తి ఉత్పత్తి 6,600 మెగావాట్లకు చేరుకుంటుంది. దీనికోసం రోజుకు సుమారు 80 వేల టన్నుల బొగ్గును మండించాల్సి ఉంటుందని, దీని వల్ల సల్ఫర్‌డయాక్సైడ్ ఉద్గారాలు భారీగా వెలువడుతాయని స్థానికులు చెబుతున్నారు. వీటితో పాటు పరిసర ప్రాంతంలో ఆర్ఎఫ్‌సీఎల్, రామగుండం బి–థర్మల్ కేంద్రం, కేశోరాం సిమెంటు కార్మాగారాలు ఉన్నాయని .. వీటి నుంచి సైతం కాలుష్య కారకాలు వెలువడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉపాధి అవకాశాలపై పరిసర గ్రామాల ప్రజల నిరసన**

ఎన్టీపీసీ ప్రాజెక్టు కోసం భూములు సేకరించిన యాజమాన్యం పరిసర గ్రామాల యువతకు ఉపాధిని విస్మరించిందన్న ఆరోపణలున్నాయి. ప్లాంటు నిర్మాణం కోసం ఎన్టీపీసీ యాజమాన్యం చుట్టు పక్కల గ్రామాలైన లక్ష్మీపురం, ఎల్కలపల్లి, కుందనపల్లి, రాజాపూర్, రాణాపూర్, మొగల్‌పహాడ్, రామగుండం ప్రాంతాల నుంచి గతంలో భూములు సేకరించింది. ఈ ప్రాంతాలకు చెందిన వారికి ఉపాధి కల్పించకపోవడంతో పాటు కనీసం ఆయా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు సామాజిక బాధ్యతను కూడా సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

# సింహభాగం.. సాగుకు యోగ్యమే!

కరీంనగర్ : జిల్లాలో సింహభాగం సారవంతమైన సాగు భూమి విస్తీర్ణమే ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతుభరోసా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సర్వే జరిపారు. అనంతరం గ్రామసభల ద్వారా రైతుల అభిప్రాయాలు తీసుకొని, జిల్లాలో సాగుకు యోగ్యమైన



భూవివరాలను వెల్లడించారు.

**డివిజన్ల వారీగా వివరాలు..**

జిల్లాలో నాలుగు వ్యవసాయ డివిజన్లు, 207 రెవెన్యూ గ్రామాలున్నాయి. డివిజన్ల వారీగా కరీంనగర్‌లో అత్యధికంగా 1830, మానకొండూర్‌లో 1568, హుజూరాబాద్‌లో 994, చొప్పదండిలో 962 ఎకరాలను సాగుకు యోగ్యం కానివిగా గుర్తించారు. ఈ భూమికి భవిష్యత్తులో రైతుభరోసా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**ఆర్థిక వెసులుబాటు మేరకు..**

సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో సర్వే అనంతరం సాగు యోగ్యమైన భూవివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటును బట్టి విడతల వారీగా రైతు భరోసా ఖాతాల్లో జమ అవుతాయి. భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి




## వేసవిలో తుఫానులు.. మార్చి 15 వరకు ఈ ప్రాంతాల్లో వర్షాలు

దేశంలో వేసవి కాలం మొదలైనా కూడా పలు ప్రాంతాల్లో మాత్రం వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో మార్చి 15 వరకు జమ్మూ కశ్మీర్, బీహార్, పశ్చిమ బెంగాల్ సహా అనేక రాష్ట్రాల్లో వానలు కురిసే అవకాశం ఉందని వెదర్ రిపోర్ట్ తెలిపింది.

ఈ వర్షాలు, రెండు వేర్వేరు తుఫానుల ప్రభావంతో వస్తున్నాయని వాతావరణశాఖ వెల్లడించింది.

**ఏ రాష్ట్రాల్లో వర్షపాతం...** ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ నుంచి బీహార్ వరకు, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు వంటి ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు ఉంటాయని వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఈ వర్షాల కారణంగా రెండు ప్రధాన తుఫానులు కూడా వచ్చే ఛాన్స్ ఉందని ప్రకటించింది. వీటి ప్రభావం దేశంలోని ఉత్తర, తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో కూడా ఉంటుందని సూచనలు జారీ చేసింది.

**తుఫానుల ప్రభావం...** అయితే ఈ తుఫాను మొదట ఇరాక్ ప్రాంతంలో ఉద్భవించి, ఉత్తర భారతదేశంలోని జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ ప్రాంతాలను ప్రభావితం చేస్తాయని ఐఎండీ తెలిపింది. ఈ తుఫాను వర్షపాతం, ఉరుములతో కూడిన భారీ వర్షాలతో వస్తుందని, దీంతో ఢిల్లీ- NCR ప్రాంతవాసులు కూడా అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ వెల్లడించింది.

**మరో తుఫాను...** రెండో తుఫాను బంగ్లాదేశ్ సమీప ప్రాంతంలో ఉద్భవించి, భారతదేశం వైపు కదులుతుందని వెదర్ రిపోర్ట్ చెప్పింది. ఇది ప్రధానంగా తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు వర్షపాతాన్ని తెస్తుందన్నారు. ఈ తుఫాను కూడా ఐదు రోజుల పాటు (మార్చి 13 నుంచి 15 వరకు) భారీ వర్షాలకు కారణమవుతుందని IMD వెల్లడించింది. ఈ క్రమంలో ఉరుములతో కూడిన వర్షాలను ఆశించవచ్చని తెలిపింది.

**దక్షిణ భారతదేశంలో..** ఈ నేపథ్యంలో రాజస్థాన్?లో కూడా మార్చి 13 నుంచి 15 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇవి ఆ ప్రాంత ప్రజలకు ఉపశమనం కల్గిస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇక దక్షిణ భారతదేశంలో ప్రధానంగా తమిళనాడులో కూడా ఈ ప్రభావం ఉంటుందని ఐఎండీ వెల్లడించింది. మార్చి 13న నాలుగు దక్షిణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. దీంతోపాటు కేరళ మాహే ప్రాంతాల్లో కూడా మార్చి 13న భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉన్నట్లు వెదర్ రిపోర్ట్ ప్రకటించింది.




## పవన్ పవర్ ఫుల్ స్పీచ్ కోసం వెయిటింగ్ !

పిఠాపురం : జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. ఇటీవల ఆయన అసెంబ్లీలో ప్రసంగం తప్ప పెద్దగా మాట్లాడింది లేదు. దానికంటే ముందు చూసుకున్నా ఆయన నుంచి వేడెక్కించే డైలాగులతో కూడిన స్పీచ్ వచ్చి చాలా కాలం అయింది అని అంటున్నారు. ముఖ్యంగా కాకినాడ పోర్టు అక్రమ బియ్యం వ్యవహారం తరువాత పవన్ పవర్ ఫుల్ స్పీచ్ అన్నది పెద్దగా ఎక్కడా కనిపించలేదని అంటారు. ఇలా అందరి కోరికతో పాటు జనసైనికుల హుషార్ ని కూడా పెంచుతూ పవన్ పవర్ ఫుల్ స్పీచ్ చేయనున్నారు అని అంటున్నారు. అది ఎపుడు అంటే ఈ నెల 14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ వేడుకల సందర్భంగా సాయంత్రం నాలుగు గంటలకు యాభై ఏకరాల సువిశాల మైదానంలో ప్రారంభం అయ్యే బహిరంగ సభలో పవన్ స్పీచ్ ఉంటుంది అని అంటున్నారు. మరి పవన్ గంట సేపు మాట్లాడుతారా అంతకు మించి మాట్లాడుతారా అన్నది కూడా ఉంది. అయితే పవన్ స్పీచ్ మాత్రం ఈసారి వేరే లెవెల్ లో ఉండొచ్చు అని అంటున్నారు. ఏపీలో రాజకీయ పరిస్థితులు ప్రస్తుతం సాగుతున్న పరిణామాలు విపక్షం వైసీపీ తీరు ఏపీలో సాగుతున్న అభివృద్ధి చేసిన కార్యక్రమాలు చేయాల్సిన వాటికి సంబంధించి పెట్టుకున్న అజెండా జాతీయ రాజకీయాలు ఇలా అన్నీ కలసి పవన్ స్పీచ్ లో కనిపించవచ్చు అని అంటున్నారు. అంతే కాదు ఏపీలో టీడీపీ కూటమి బంధం పైనా పవన్ కామెంట్స్ ఉండొచ్చు అని అంటున్నారు. పదిహేనేళ్ళ పాటు టీడీపీ తో జనసేన బంధం అంటే దాని వెనక అర్ధం పరమార్ధం తమ పార్టీ క్యాడర్ కి పవన్ వివరించే ప్రయత్నం చేయవచ్చు అని అంటున్నారు. ఇన్నేళ్ళ పాటు జనసేన కేవలం జూనియర్ పార్టనర్ గా ఉంటూ టీడీపీకే పెద్దన్న పాత్రలో ఉంచుతుందా అన్న జనసేన సందేహాలకు ఆయన నుంచి సమాధానం రావచ్చు అని అంటున్నారు.




అమరావతి: ఏపీలోని వర్సిటీల్లో తప్పు చేయాలంటేనే భయపడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉంటాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అక్రమాలపై అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో చర్చ జరిగింది. వైకాపా ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు జరిగాయని తెదేపా, భాజపా, జనసేన ఎమ్మెల్యేలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై తెదేపా ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడారు. అనంతరం మంత్రి లోకేశ్ వారికి సమాధానమిచ్చారు. ఏయూలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. ఇన్‌ఛార్జ్ వీసీ ఇప్పటికే విచారణకు ఆదేశించారన్నారు. ఆ విచారణ నివేదిక రాగానే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు అవుతున్నా ఇంకా ఉపేక్షించడం తగదన్నారు. నిర్దిష్ట కాలపరిమితితో విచారణను వేగవంతం చేయాలని ఆయన కోరారు. మరో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ.. గతంలో వీసీగా పనిచేసిన ప్రసాదరెడ్డి వైకాపా అధ్యక్షుడి తరహాలో వ్యవహరించారని ఆరోపించారు. ఎంతో పేరున్న ఏయూను రాజకీయ వేదికలా ఆయన మార్చారని ఆక్షేపించారు. ఇతర వర్సిటీల ప్రక్షాళన కూడా జరగాలని జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు.

## వంగవీటిలో వైరాగ్యం నిజమేనా ?



అమరావతి : తండ్రి వంగవీటి మోహన రంగా ఒక బలమైన సామాజిక వర్గానికి ఆరాధ్య నాయకుడు. అంతే కాదు బడుగు బలహీన వర్గాలకు ఆయన దేవుడు. ఒక్కసారే ఎమ్మెల్యే అయినా రాష్ట్ర స్థాయి నేతగా గుర్తింపు పొందారు. ఆయన ఆలోచనలు ఆశయాలు ఈ రోజుకూ తెలుగు నాట మారుమోగుతుంటాయి. వంగవీటి రంగా అంటేనే ఒక రకమైన పాజిటివ్ వైబ్రేషన్స్ వస్తాయి. అలాంటి రంగా వారసుడు ఎంతగా కనిపించాలి. ఆయన ఎంతగా రాణించాలి. కానీ అదేంటో కానీ వంగవీటి రాధాక్రిష్ణకు రాజకీయంగా అన్నీ అవాంతరాలే ఎదురవుతున్నాయని అంటున్నారు. ఆయన రాజకీయ జీవితం కాంగ్రెస్ తో 2004లో మొదలైంది. ఆనాడు విజయవాడ తూర్పు నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తరువాత 2009 నాటికి ఆయన ప్రజారాజ్యం పార్టీలో చేరి పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు. ఇక ఆయన 2014లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు. 2019లో ఆ పార్టీ టికెట్ దక్కలేదని టీడీపీ వైపు వచ్చారు.

అయితే టీడీపీ నుంచి టికెట్ దక్కలేదు. పైగా పార్టీ ఓటమి పాలు అయింది. గత అయిదేళ్ళుగా అలా విపక్షంలో ఆయన ఉన్నారు. ఒక విధంగా చూస్తే వైసీపీ విపక్షంలో ఉన్నపుడు అందులోనూ ఉన్నారు. ఇలా రాజకీయంగా అవకాశాలను అందుకోలేక రాధాకృష్ణ ఇబ్బందులు పడుతున్నారు. 2024 ఎన్నికల్లో రాధాకు విజయవాడ సెంట్రల్ టికెట్ ఇస్తారని అనుకున్నా అది సీనియర్ నేత బోండా ఉమాకు దక్కింది. దాంతో ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. తీరా చూస్తే ఇప్పటికి ఏపీ నుంచి ఏడు ఎమ్మెల్సీలు ఖాళీ అయితే టీడీపీ అందులో నాలుగు తీసుకుంది కానీ రాధాకు మాత్రం చాన్స్ ఇవ్వలేదు. తాజా ఎంపికలోనూ రాధాకు మొండి చేయి దక్కింది. దాంతో రాధా వర్గం పూర్తి నిరాశలో ఉంది. చట్టసభలలో రాధా ప్రవేశించి రెండు దశాబ్దాలకు పై దాటుతోందని వారు అంటున్నారు. రంగా కుమారుడిగా అందరూ ఆయన గురించి చెబుతారు కానీ తీరా పదవులు దగ్గరకు వచ్చేసరికి మాత్రం ఆయనకు అవి దూరంగా అవుతున్నాయని అంటున్నారు. ఈసారి ఎమ్మెల్సీ గ్యారంటీ అని మంత్రి పదవి కూడా ఖాయమని అంతా అనుకున్న నేపథ్యంలో రాధాకు ఈ విధంగా జరగడం పట్ల చర్చ సాగుతోంది. మరో వైపు రాధా కూడా రాజకీయ వైరాగ్యంలో ఉన్నారని అంటున్నారు. ఇంతకాలం చేసిన రాజకీయం ఇక చాలు అని రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెడదామా అన్న ఆలోచనలో ఉన్నారని ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగుతోంది. అయితే ఇందులో ఏ మేరకు నిజం ఉందో తెలియదు కానీ రాధా వర్గం అప్ సెట్ అయింది అని అంటున్నారు. ఇక రాధా కూడా నిలకడ లేని రాజకీయం చేశారు అన్న ముద్ర కూడా ఉంది అంటున్నారు. ఆయన అనేక పార్టీలు మారారు. కానీ ఆయా పార్టీల నుంచి ఆయనకు దక్కింది ఏమీ లేదు కానీ ఈ ముద్ర మాత్రం మిగిలింది అంటున్నారు. ఇంకో వైపు ఆ పార్టీలకు వంగవీటి బ్రాండ్ ని ఆయన అందించారు కానీ ఆయనకు ఒరిగింది లేదని అంటున్నారు. ఈ క్రమంలో తాను రాజకీయంగా ఎందుకు కొనసాగాలి అని ఆయనను ఆలోచింపచేస్తోంది అని అంటున్నారు. ఆయన కనుక తీవ్ర నిర్ణయం తీసుకుంటే మాత్రం అది వంగవీటి అభిమానులతో పాటు ఒక బలమైన సామాజిక వర్గానికి ఇబ్బందికరమే అవుతుంది అని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో వాస్తవం ఎంత ఉందో.

## ఓబులాపురం వద్ద ఆందోళనల ఘటన.. తెదేపా నేతలపై కేసు కొట్టివేత



విజయవాడ: ఓబులాపురం వద్ద అప్పటి తెదేపా నేతల ఆందోళనలపై నమోదైన కేసులను ప్రజాప్రతినిధుల కోర్టు కొట్టివేసింది. విచారణలో భాగంగా గురువారం పలువురు నేతలు విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు.

ఇక్కడికి వచ్చిన వారిలో మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు దేవినేని ఉమ, చినరాజప్ప, ఎర్రబెల్లి దయాకర్‌రావు, నాగం జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, తదితరులున్నారు. 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో తెదేపా నేతలు ఓబులాపురం గనుల పరిశీలనకు వెళ్లారు. దీనిపై అప్పట్లో కేసులు నమోదయ్యాయి. గత కొన్నేళ్లుగా తెదేపా నేతలు విచారణకు హాజరవుతుండగా.. నేడు కేసు కొట్టివేతతో విముక్తి లభించింది.

## చిన్నమ్మ కోసం పెద్ద పదవి రెడీ చేసిన బీజేపీ ?



ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా ఉన్న దగ్గుబాటి పురంధేశ్వరి పదవీ కాలం ఈ ఏడాది జూలైలో ముగుస్తోంది. ఆమె రాజమండ్రి నుంచి ఎంపీగా గెలిచారు. కచ్చితంగా కేంద్రంలో కేబినెట్ ర్యాంక్ పదవి ఆమెకు రావాలి. కానీ అలా జరగలేదు. అదే టైంలో ఆమె సామాజిక వర్గానికి చెందిన టీడీపీ ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కి కేంద్రంలో సహాయ మంత్రి పదవి దక్కింది. అలాగే గోదావరి జిల్లాలకు చెందిన బీజేపీ ఎంపీ శ్రీనివాసవర్మకు మరో మంత్రి పదవి దక్కింది. దాంతో దగ్గుబాటి పురంధేశ్వరికి కేంద్ర మంత్రివర్గంలో చాన్స్ ఇవ్వలేకపోయారు. ఆమెకు స్పీకర్ పదవి ఇస్తారని అందుకే అలా చేశారని కూడా అప్పట్లో అనుకున్నారు. కానీ ఆ పదవి కూడా మరోసారి ఓం బిర్లాకే ఇచ్చారు. దాంతో ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పదవి తరువాత పురంధేశ్వరికి ఏమి దక్కనుంది అన్నది చర్చకు వస్తున్న విషయం. అయితే ప్రచారంలో ఉన్న దాని ప్రకారం చూస్తే ఆమెకు అతి పెద్ద పదవికే బీజేపీ పెద్దలు రిజర్వ్ చేసి ఉంచారని అంటున్నారు. బీజేపీలో ఈ పదవి చేపడితే మాత్రం పురంధేశ్వరి ఒక రికార్డుని కూడా క్రియేట్ చేసిన వారు అవుతారు అని అంటున్నారు. బీజేపీ ఆవిర్భవించి ఈ ఏడాది ఏప్రిల్ 6 నాటికి అక్షరాలా 45 ఏళ్ళు అవుతోంది. బీజేపీకి ఈ మధ్య కలాంలో అంతా జాతీయ అధ్యక్షులుగా పురుషులే వ్యవహరించారు. అర్ధ శతాబ్దం చరిత్రకు సమీపంలో ఉన్న బీజేపీలో ఒక్క మహిళ కూడా అధ్యక్షురాలు కాలేకపోయారు. దీంతో బీజేపీ ఈసారి జాతీయ అధ్యక్ష పదవిని మహిళలకు ఇవ్వాలని చూస్తోందిట. దాంతో చిన్నమ్మ పేరుని ప్రముఖంగా పరిశీలిస్తోంది అని అంటున్నారు. ఆమెకు కనుక ఇస్తే దక్షిణ భారత దేశంలో బీజేపీ మరింతగా వికసిస్తుందని అందునా రెండు తెలుగు రాష్ట్రాలలో కాషాయ పతాకం రివ్వున ఎగిరేందుకు వీలు ఉంటుందని భావిస్తున్నారని టాక్. ఇక పురంధేశ్వరి లెజెండరీ పర్సనాలిటీ అయిన ఎన్టీఆర్ కుమార్తె కవడం బలమైన సామాజిక నేపథ్యం తో పాటు ఆమె రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకోవడంతో ఆమె ఈ పదవికి తగిన వారుగా భావిస్తున్నారుట. ఇక ఆమె ఏపీ సీఎం చంద్రబాబుకు స్వయాన వదినగారు. ఎన్డీయేలో టీడీపీ కీలకంగా ఉంది. అలా ఈ బంధం మరింత గట్టి పడాలీ అంటే పురంధేశ్వరికి ఈ పదవి ఇవ్వడం మేలు అని అంటున్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండగా మహిళా బిల్లుని ఆమోదించింది. ఆ విధంగా తాము మహిళా పక్షం అని చాటి చెప్పింది. వచ్చే ఎన్నికలలో మహిళా రిజర్వేషన్ ని అమలు చేయాలని చూస్తోంది. ఈ క్రమంలో ముందుగా తమ పార్టీలో మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పుకోవడానికి అన్నట్లుగా శిఖరాయమానమైన పదవికే వారికి అప్పగించాలని చూస్తున్నారు అని అంటున్నారు. దాంతో పురంధేశ్వరికి ఈ పదవి దక్కితే మాత్రం తెలుగు నాట వెంకయ్యనాయుడు, బంగారు లక్ష్మణ్ తరువాత మరో తెలుగు వారికి ఈ అతి పెద్ద అవకాశం దక్కినట్లు అవుతుందని అంటున్నారు. ఇక ఏపీ నుంచి చూసుకుంటే వెంకయ్యనాయుడు తరువాత ఈ కీలక పదవిని అధిరోహించిన రెండవవారుగా ఆమె ఉంటారని అంటున్నారు. మొత్తానికి చూస్తే ఎంతో మంది పేర్లను జాతీయ అధ్యక్ష పదవి కోసం చూస్తున్న బీజేపీ దగ్గుబాటి పురంధేశ్వరి దగ్గర ఆగి సీరియస్ గానే పరిశీలిస్తోంది అని అంటున్నారు. చూడాలి మరి ఈ సంచలన ప్రకటన ఎపుడు వెలువడుతుందో. ఈ వార్తలలో ఎంత వాస్తవం ఉందో.

## పెన్షన్ల సంఖ్య తగ్గింపుపై మండలిలో ఆసక్తికర చర్చ




అమరావతి, మార్చి 13: ఏపీ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. మండలిలో ప్రశ్నోత్తరా సమయంలో సామాజిక పెన్షన్ల సంఖ్య తగ్గింపుపై ఆసక్తికర చర్చ జరిగింది. వివిధ కారణాలతో పెన్షన్లను తొలగించారని, దాదాపు రెండు లక్షల పెన్షన్లు తగ్గించారని వైసీపీ సభ్యులు తెలిపారు. వైసీపీ హాయంల 13 లక్షల వరకు కొత్త పెన్షన్లు ఇచ్చామని చెప్పుకొచ్చారు. వైసీపీ సభ్యుల ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధీటైన సమాధానం ఇచ్చారు. పెన్షన్లు ఇచ్చిందే ఎన్టీఆర్ అంటూ మంత్రి గుర్తు చేశారు.

**వైసీపీ సభ్యుల వ్యాఖ్యలు ఇవే..** రెండు లక్షల పెన్షన్లు తగ్గించారని.. దివ్యాంగుల పెన్షన్లను కూడా తగ్గించేశారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వివిధ కారణాలతో పెన్షన్లు తొలగిస్తున్నారన్నారు. పేదలకిచ్చే పెన్షన్ల విషయంలో భూతద్దంలో చూడాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. వైసీపీ వాళ్ళెవరికి పని చేయవద్దని సీఎం చంద్రబాబే చెప్పారంటూ వ్యాఖ్యలు చేశారు. 14 వేల పెన్షన్లు తగ్గించినట్లు చెబుతున్నారని కానీ.. ప్రభుత్వం ఇచ్చిన లెక్కలు చూస్తే రెండు లక్షల పెన్షన్లు తగ్గించినట్లు అర్థం అవుతుందని వైసీపీ సభ్యుడు రమేష్ యాదవ్ అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త పెన్షన్లు ఇచ్చారా లేదా అని అడిగారు. వైసీపీ హయాంలో ఐదేళ్ళలో 13 లక్షల కొత్త పెన్షన్లు ఇచ్చామని రమేష్ తెలిపారు. పెన్షన్ల తొలగింపులో ఏ విధానాలు పాటిస్తున్నారని మరో సభ్యుడు మొండితో అరుణ్ కుమార్ ప్రశ్నించారు. పదిహేను రోజుల్లో దివ్యాంగుల సర్టిఫికెట్ ఇవ్వాలని కండిషన్ పెట్టారని, 13 పాయింట్లు వెరిఫికేషన్ చేస్తున్నారని అరుణ్ పేర్కొన్నారు.


**మంత్రి సమాధానం..** వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇస్తూ.. పెన్షన్లు ఇచ్చిందే ఎన్టీఆర్ అని చెప్పుకొచ్చారు. 200 నుంచి 1000, 1000 నుండి 2000 చేసింది టీడీపీయే అని గుర్తుచేశారు. 3000 నుంచి 4000 రూపాయలకు పెంచింది కూడా కూటమి ప్రభుత్వమే అని తెలిపారు. 13 శాతం జనాభాకు పెన్షన్ అందిస్తున్నామన్నారు. 2019 నుంచి 2024 వరకూ 24 లక్షల పెన్షన్లు తగ్గించారు. 13 పాయింట్ వెరిఫికేషన్ తాము చేయడం లేదని స్పష్టం చేశారు. రెండు లక్షల పెన్షన్లు తగ్గించామనేది అసత్యమన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత లక్షా ఎనభై వేల మంది చనిపోయారని తెలిపారు. 14 వేల పెన్షన్లు తొలగించిన వారిలో శాశ్వత వలసదారులే అధికంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో అనర్హులకి పెన్షన్లు ఇచ్చారన్నారు.

హెల్త్ పెన్షన్‌కు ఎప్పుడైనా అర్జీ పెట్టుకోవచ్చని తెలిపారు. కడప జిల్లాలో 3000పైగా దివ్యాంగుల పెన్షన్లున్నాయన్నారు. కలెక్టర్ వెరిఫై చేస్తే కేవలం 1300 మంది మాత్రమే అర్హులని తేలిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.

**ఆడబిడ్డ నిధి పథకంపై...** ఇక ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారంటూ వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ప్రశ్నించారు. 18 - 60 ఏళ్ళ మధ్యనున్న మహిళలకు నెలకి 1500 ఇస్తామని హామీ ఇచ్చారని.. ఇప్పటి వరకూ ఎంత మంది లబ్దిదారులు ఉన్నారో గుర్తించారా అని అడిగారు. ఎంత నిధులు అవసరం అవుతాయో లెక్కగట్టారా అని ప్రశ్నించారు. మంత్రి వర్గ ఉపసంఘం కాని అధికారుల కమీటీగాని వేశారా అని ప్రభుత్వాన్ని అడిగారు. దాదాపు కోటి మందికిపైగా లబ్దిదారులు ఉన్నారని.. ఏడాదికి 32000 వేల కోట్ల నిధులు అవసరం అవుతాయని వరుదు కళ్యాణి చెప్పుకొచ్చారు.

**తప్పకుండా అమలు చేస్తామన్న మంత్రి...** ఆడబిడ్డ నిధి బడ్జెట్ కోసం ప్రణాళికాబద్ధంగా వెళుతున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. ప్రభుత్వానికి కొంత సమయం కావాలని.. ఆడబిడ్డ నిధి పథకం కచ్చితంగా అమలు చేస్తాంమని మండలిలో మంత్రి స్పష్టం చేశారు.


## వివేకా పీఏ కృష్ణారెడ్డి పెట్టింది తప్పుడు కేసు.. తేల్చిన పులివెందుల పోలీసులు



పులివెందుల: మాజీ మంత్రి వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి పెట్టింది తప్పుడు కేసు అని పులివెందుల పోలీసులు తేల్చారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా కృష్ణారెడ్డి ఫిర్యాదుతో వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్‌పై 2023 డిసెంబర్ 15న అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ముగ్గురిపై పెట్టింది తప్పుడు కేసుగా విచారణలో తేలిందని పులివెందుల పోలీసులు తాజాగా పేర్కొన్నారు. ఈ మేరకు జమ్మలమడుగు కోర్టులో చివరి ఛార్జ్‌షీట్‌ను పులివెందుల డీఎస్పీ దాఖలు చేశారు. పులివెందుల మెజి స్ట్రేట్ సెలవులో ఉన్నందున జమ్మలమడుగు కోర్టులో సమర్పించారు. ఈ కేసులో 23 మంది సాక్షులను విచారించినట్లు ఛార్జ్‌షీటులో పేర్కొన్నారు.

## ప్రగ్యా జైస్వాల్.. ట్రెడిషనల్ డ్రెస్సులో స్టన్నింగ్ గ్లామర్ డోస్

టాలీవుడ్ లో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యా జైస్వాల్, సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటూ ఫ్యాన్స్ ను అలరిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. పెళ్లి వేడుకలో తళుక్కుమన్న ప్రగ్యా అందమైన పింక్ శారీ లో మెరిసిపోతోంది. ఈ స్పెషల్ ఫోటోషూట్‌లో ఆమె సంప్రదాయ లుక్ కు గ్లామర్ టచ్‌ను మిక్స్ చేసింది. కాస్త వెస్ట్రన్ టచ్ ఉన్న స్టైలిష్ లుక్ తో ఆమె నవ్వుతూ ఫోజులిస్తూ అభిమానులకు కనువిందు అందించింది. ఈ లుక్స్ లో ప్రగ్యా మెరిసిన విధానం చూసిన నెటిజన్లు ఆమె స్టైల్ సెన్స్ గురించి ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఫోటోల్లో ఆమె వేసుకున్న పింక్ శారీ డిజైనర్ కలెక్షన్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్రమంగా ఆమె ఫ్యాషన్ అభిరుచి




మరింతగా మెరుగు పడుతుండటం స్పష్టంగా కనిపిస్తోంది. మ్యాచింగ్ జ్యువెలరీ తో ప్రగ్యా అందానికి అదనపు మెరుపు వచ్చింది. స్టైలింగ్ డిజైనర్ మనోఙ్ఞ గోల్లపూడి ఈ లుక్ ను డిజైన్ చేయడం విశేషం. ఆభరణాల ఎంపిక కూడా ఆమె లుక్ కి మరింత అందాన్ని తెచ్చింది. ఆమె మేకప్ స్టన్నింగ్ గా ఉండటంతో పాటు, ఆమె కురులు తళుక్కుమన్న తీరు అభిమానులను కట్టిపడేస్తోంది. ఈ ఫోటోల గురించి ప్రగ్యా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆసక్తికరమైన క్యాప్షన్ ఇచ్చింది. "ప్రేమతో నిండిన రోజులు, మాయతో నిండిన రాత్రులు.." అంటూ ఆమె ఈ వేడుకలో గడిపిన సమయాన్ని గుర్తుచేసుకుంది.

బహ్రైన్ లో జరిగిన ఓ పెళ్లి వేడుక సందర్భంగా ఈ ఫోటోలు తీయించుకున్నట్టు ఆమె క్యాప్షన్ ద్వారా వెల్లడించింది. ఫ్రెండ్ వెడ్డింగ్ లో పాల్గొన్న ఈ బ్యూటీ అక్కడ తన లుక్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ వేడుక తాలూకు ఫోటోలు ఆమె ఇన్‌స్టాలో షేర్ చేయగా, అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. "గ్లామర్ క్వీన్" అంటూ అనేక మంది ఆమె అందాన్ని మెచ్చుకుంటున్నారు. ప్రగ్యా ప్రస్తుతం తన కొత్త ప్రాజెక్ట్ లతో బిజీగా ఉంది. టాలీవుడ్ లో తనకంటూ సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకోవాలని ప్రయత్నిస్తోంది.

## హిట్ మూవీ సీక్వెల్ కు బిజినెస్ కష్టాలు!

మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ సినిమాల్లో నటించడం మాత్రమే కాదు, సినిమాలకు దర్శకత్వం కూడా వహిస్తాడనే విషయం తెలిసిందే. ఇప్పటికే పలు సినిమాలకు దర్శకత్వం వహించిన ఆయన మోహన్ లాల్ తో చేసిన లూసీఫర్ ఎంత బ్లాక్ బస్టర్ హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్ గా ఎల్2: ఎంపురాన్ వస్తోంది. మార్చి 27న రిలీజ్ కానున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ఇప్పటివరకు మొదలవక పోవడంతో మోహన్ లాల్ ఫ్యాన్స్ కంగారు పడుతున్నారు. మిగిలిన భాషల సంగతి పక్కన పెడితే ఒరిజినల్ వెర్షన్ మలయాళంలో కూడా ఎల్2: ఎంపురాన్‌కు ప్రమోషన్స్ మొదలవకపోవడం చూసి ఫ్యాన్స్ టెన్షన్ పడుతున్నారు. ఎస్ఎస్ఎంబీ29 షూటింగ్ లో బిజీగా ఉన్న పృథ్వీరాజ్ కు ఎల్2 ప్రమోషన్స్ గురించి పట్టించుకునే తీరిక




లేకపోవడంతో భారమంతా నిర్మాతల మీదే పడింది. అయితే ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ఇంకా మొదలుపెట్టకపోవడానికి కారణం సినిమాకు బిజినెస్ జరగకపోవడమేనని సమాచారం. నిర్మాతలు చెప్తున్న రేటుకి, ఓటీటీ సంస్థలు కోట్ చేస్తున్న రేటుకీ భారీ తేడా ఉండటం వల్లే బిజినెస్ అవడం లేదని తెలుస్తోంది. దానికి తోడు ఎల్2 నిర్మాణ సంస్థ లైకా కావడంతో వారి గత సినిమాలకు సంబంధించిన లావాదేవీలు పెండింగ్ ఉన్నాయట. దీంతో బయ్యర్లు సరిగా రెస్పాండ్ అవడం లేదని, ఈ నేపథ్యంలో థియేటర్ల అగ్రిమెంట్ విషయంలో లేటవుతుందని తెలుస్తోంది. ఈ లేట్ వల్లే తెలుగు రాష్ట్రాలతో పాటూ తమిళనాడు, కర్ణాటకలో కూడా ఎక్కువ స్క్రీన్లు రాబిన్‌హుడ్, మ్యాడ్ స్క్వేర్, విక్రమ్ వీర ధీర శూర్2 లు లాక్ చేసుకుంటున్నాయని తెలుస్తోంది. మరి ఇలాంటి సిట్యుయేషన్స్ లో ఎల్2 చెప్పిన డేట్ కు వస్తుందా అంటే అందులో ఎలాంటి అనుమానం పన్లేదంటున్నారు. ఏదైనా ఒక హిట్ సినిమా సీక్వెల్ రిలీజ్ కు ఇలాంటి సిట్యుయేషన్స్ ఎదురవడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది.




## సమంత లైఫ్.. నాగచైతన్య గుర్తులు ఇంకా అలానే..





టాలీవుడ్‌లోనే కాదు, పాన్ ఇండియా స్థాయిలో స్టార్‌గా ఎదిగిన సమంత తన వ్యక్తిగత జీవితం విషయంలో ఎన్నో ఎత్తుపల్లాలు ఎదుర్కొంది. నాగ చైతన్యతో విడిపోయిన తర్వాత ఆమె జీవితంలో వచ్చిన మార్పులు మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేయడమే కాకుండా, ఫ్యాషన్, వ్యక్తిగత జీవితం పరంగా కూడా ఆమె ప్రత్యేకమైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోంది. తాజాగా, తన ఎంగేజ్‌మెంట్ రింగ్‌ను పెండెంట్‌గా మార్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఇది కేవలం ఒక ఆభరణపు మార్పు కాదు, తన కొత్త జీవితానికి ఇచ్చిన చిహ్నంగా కూడా భావించాలి. ఇక ఆమె మెడలో వేసుకునే గోలుసుకు జత చేసి ధరించినట్లు తెలుస్తోంది. సమంత, నాగ చైతన్యకు సంబంధించిన ఏ విషయం అయినా వెంటనే వైరల్ అవుతోంది. విడాకుల అనంతరం ఆమె చేతికి ఉన్న మూడు క్యారెట్ల డైమండ్ రింగ్ మాయం కావడంతో, అభిమానులు అనేక ఊహాగానాలు మొదలుపెట్టారు. ఈ రింగ్‌ను ఆమె ఇక ఉపయోగించరని అర్థమైంది. కానీ, అది పూర్తిగా వదిలిపెట్టకుండా, ఒక మెడలో నెక్లెస్ లా మార్చుకోవడం ఆసక్తికరంగా మారింది. ఇది ఆమె గతాన్ని మర్చిపోవడం కాదు, దానిని ఒక కొత్త అర్థంతో తన జీవితంలో నిలబెట్టుకోవడమనే అభిప్రాయాన్ని ఇస్తోంది. విడాకుల తర్వాత ఎంగేజ్‌మెంట్ రింగులను రీడిజైన్ చేసుకోవడం నేటితరం వారికి కొత్త ట్రెండ్ గా మారింది. ఇదే విధంగా, సమంత తన ఫ్యాషన్ ఎంపికల ద్వారా కూడా తన మనోభావాలను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తోంది. 2024లో, తన తెలుపు రంగు వెడ్డింగ్ గౌన్‌ను బ్లాక్ బాడీకాన్ డ్రెస్‌గా మార్చుకుని వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. అభిమానులు దీన్ని "రివెంజ్ డ్రస్" అని అభివర్ణించారు. అయితే, సమంత మాత్రం దాన్ని కొత్త జీవితాన్ని స్వీకరించడమనే సందేశంగా మలిచింది. ఆమె సుస్థిరమైన ఫ్యాషన్ గురించి చర్చిస్తూ, వాడిన వస్త్రాలను మళ్లీ ఉపయోగించుకోవడం అవసరమని చెప్పింది. ఇదంతా చూసిన అభిమానులకు ఆమె స్టైల్ కేవలం ట్రెండ్ కోసం కాదని, తన జీవిత మార్గాన్ని ప్రతిబింబించేలా ఉంటుందని అర్థమైంది. అయితే, తన గతాన్ని పూర్తిగా తీసి పారేసే ప్రయత్నం మాత్రం సమంత చేయడం లేదు. ఆమె జీవితంలోని కొన్ని గుర్తుగా మిగిలిపోతున్నాయి. ముఖ్యంగా నాగ చైతన్యకు అంకితం చేసిన టాటూ ఇప్పటికీ ఆమె శరీరంపై ఉంది. అది పోగొట్టుకోవడం కష్టం అనే భావనా లేక ఇది కూడా ఒక గుర్తుగా ఉండాలని భావించిందా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. కానీ, సమంత తన పద్ధతిలో జీవితాన్ని మళ్లీ నిర్మించుకుంటూ పోతుండటంతో, ఈ అంశాలు ఆమెను పెద్దగా ప్రభావితం చేయడం లేదు. సమంత ఇప్పుడు పూర్తిగా తన కెరీర్ పై దృష్టి పెట్టుకుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడం, తన జీవితాన్ని సరికొత్తగా తీర్చిదిద్దుకోవడం ఆమె ప్రధాన లక్ష్యంగా మారినట్లు కనిపిస్తోంది. ఆమె సినిమాల్లో చేస్తున్న ప్రయోగాలు, వ్యక్తిగత జీవితం లో తీసుకుంటున్న నిర్ణయాలు చూసినట్లయితే, ఆమె ఎప్పుడూ వెనక్కి తిరిగి చూసే వ్యక్తి కాదని స్పష్టంగా అర్థమవుతోంది. వ్యక్తిగత జీవితం ఎంత కఠినమైనదైనా, దానిని తనదైన శైలిలో స్వీకరించి, ముందుకు సాగడమే ఆమె ధోరణిగా మారింది.


## సర్ ప్రైజ్ డోస్ పెంచిన కేతిక.. మరింత హీటెక్కించేలా..



యంగ్ హీరో నితిన్, టాలెంటెడ్ డైరెక్టర్ వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రాబోయే మాస్ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్' భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తి కావచ్చి, పోస్టు ప్రొడక్షన్ దశలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ సంగీతాన్ని అందిస్తుండగా, శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక సినిమాను మార్చి 24న రిలీజ్ చేయనున్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే రెండు పాటలు విడుదలయ్యాయి, మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ నితిన్‌కు మరో హిట్ అందిస్తుందని టాలీవుడ్ వర్గాల్లో మంచి బజ్ నడుస్తోంది. సినిమాపై హైప్ పెంచేందుకు మేకర్స్ స్టెప్ అప్ చేశారు. ఇప్పటికే ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేస్తూ, ఆడియెన్స్‌ని కట్టిపడేస్తున్నారు. తాజాగా విడుదలైన స్పెషల్ సాంగ్ "అధి ధా సర్ ప్రైజు" మాస్ ఫ్యాన్స్‌ని ఆకట్టుకునేలా రూపొందించబడింది. మోడ్రన్ గ్లామరస్ బ్యూటీ కేతికా శర్మ స్పెషల్ సాంగ్ చేస్తుండటం టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. "అధి ధా సర్ ప్రైజు" పాటలో కేతికా గ్లామర్ డోస్ పెంచుతూ ఫుల్ ఎనర్జీతో స్టెప్పులేస్తోంది. లిరిక్స్, బీట్స్‌కి తగ్గట్టుగా ఆమె మూమెంట్స్ డాన్సింగ్ ఫీలింగ్‌ను రెట్టింపు చేస్తున్నాయి. ఈ పాటలో కేతికా స్టైలింగ్, ఎక్స్‌ప్రెషన్స్ అన్నీ మాస్ ఆడియెన్స్‌కు రీచ్ అయ్యేలా డిజైన్ చేయబడ్డాయి. పాట విడుదలైనప్పటి నుంచి కేతికా హాట్ టాపిక్ అవుతోంది. అయితే, ఈ పాటలో కొన్ని స్టెప్పులపై సోషల్ మీడియాలో హాట్ డిబేట్ నడుస్తోంది. మ్యూజిక్ కంపోజిషన్ విషయంలో పెద్దగా రిమాక్స్ రాలేదు. అయితే పాటలోని హుక్ స్టెప్ హైలైట్ అవుతుందని మేకర్స్ చెబుతున్నా, కాంట్రవర్సీకి దారి తీస్తోంది. ఈ వివాదంతో పాటు నెటిజన్ల డిబేట్ వల్ల "అధి ధా సర్ ప్రైజు" పాట మరింత వైరల్ అవుతోంది. తాజాగా, ఈ హీట్ ఇంకా తగ్గకముందే కేతికా మరో ఇంటెన్స్ రీల్స్ వీడియో షేర్ చేసింది. తన సోషల్ మీడియా హ్యాండిల్‌లో, సాంగ్ ప్రాక్టీస్ సెషన్ వీడియోను షేర్ చేయడంతో అది హీటెక్కించింది. క్లాసీ లుక్, హాట్ ఎక్స్‌ప్రెషన్స్, హై ఎనర్జీ మూమెంట్స్‌కి మాస్ ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. లైకులతో షేర్లతో కేతికా డాన్స్ వీడియో ట్రెండింగ్‌లోకి వెళ్లిపోయింది. సినిమా రిలీజ్ దగ్గర పడుతుండటంతో, ప్రొమోషన్‌లో కేతికా ఊహించని స్థాయిలో హైలైట్ అవుతోంది. మరి ఈ పాట బిగ్ స్క్రీన్ మీద ఎంత వరకూ క్లిక్కవుతుందో చూడాలి.

## జాన్వీ కపూర్.. గోల్డెన్ గ్లామర్‌లో మెరిసిన అందం

బాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి జాన్వీ కపూర్ మరోసారి తన గ్లామర్‌తో హాట్ టాపిక్ గా మారింది. తన మొదటి సోలో డాన్స్ నంబర్ 'నడియోన్ పార్' కి సంబంధించిన తన అనుభవాలను పంచుకుంటూ గోల్డెన్ డ్రెస్‌లో స్టన్నింగ్ ఫోటోషూట్ చేసింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ అవుట్‌ఫిట్ స్పెషల్ గా ఒకే రోజు డిజైన్ చేయించుకోవడం గమనార్హం. మణీష్ మల్హోత్రా డిజైనింగ్‌లో మెరిసిన ఈ గోల్డెన్ డ్రెస్‌లో జాన్వీ అందాల విందు చేస్తూ ఫ్యాషన్ స్టేట్‌మెంట్ క్రియేట్ చేసింది. ఈ డాన్స్ నంబర్ కోసం జాన్వీ మూడు రోజుల పాటు రిహార్సల్స్ చేసింది. మధ్యలో 'గుడ్ లక్ జెర్రీ' సినిమా షూటింగ్ చేసుకుంటూ, పాటియాలా లో రాత్రంతా షూట్ చేసి, ఉదయాన్నే ముంబైకి తిరిగొచ్చి 'నడియోన్ పార్' సాంగ్‌ను ఏడు గంటల్లో పూర్తి చేసేసిందట. అంతేకాదు, ఏ



మాత్రం నిద్ర లేకుండా మళ్లీ షూటింగ్ లోకి వెళ్లడం తనకు నిజంగా ఓ మైండ్ బ్లోయింగ్ అనుభవంగా అనిపించిందని చెప్పింది. ఏ మాత్రం అలసట లేకుండా, అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్స్, గ్రేస్‌ఫుల్ మూమెంట్స్ తో ఈ పాటను పూర్తి చేయడం ఆమె కెరీర్‌లో ఒక స్పెషల్ అచీవ్‌మెంట్ గా నిలిచింది. ఈ గోల్డెన్ అవుట్‌ఫిట్ కేవలం 24 గంటల్లో తయారు చేయించుకున్నట్లు జాన్వీ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ లో తెలిపింది. మణీష్ మల్హోత్రా చివరి నిమిషంలో తన కోసం ఈ డ్రెస్ డిజైన్ చేశారని, అతను నిజంగా ఓ నైట్ ఇన్ షైనింగ్ ఆర్మర్ లాంటివారని కామెంట్ చేసింది. కత్రినా కైఫ్ తనకు స్టైలింగ్, మేకప్, డాన్స్ విషయాల్లో ఇన్‌స్పిరేషన్ అని పేర్కొనడం విశేషం. జాన్వీ గ్లామరస్ లుక్స్ కు బాలీవుడ్ ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. గోల్డెన్ కలర్ లో ఆమె మెరుపులు పూయించిన ఈ ఫోటోషూట్ ఆమె అభిమానులకు మరింత కనువిందు చేసింది. 'రూహి' సినిమాకు నేటితో నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భం లో ఈ డాన్స్ నంబర్ ఆమె కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైనదని చెప్పింది. మొదటి సోలో డాన్స్ నంబర్ కావడంతో ఎంతో నర్వస్ గా ఫీల్ అయ్యానని, లైట్స్ కింద మళ్లీ మళ్లీ కళ్ళు మూసుకునేదానినని, కానీ చివరికి ఫైనల్ అవుట్‌పుట్ చూసి ఎంతో సంతృప్తి కలిగిందని చెప్పింది.

## మీరు వర్జినా? అనేసరికి హీరోయిన్ ఏం చెప్పిందంటే..

సోషల్ మీడియా ఇప్పుడు సెలబ్రిటీలకు ఓ వేదికే కాదు, పలు సందర్భాల్లో వారికి ఇబ్బందికరమైన అనుభవాలకూ కారణమవుతోంది. సినిమాల్లో ఎంత బోల్డ్‌గా కనిపించినా, వ్యక్తిగతంగా కొన్ని హద్దులు ఉండాలని భావించే హీరోయిన్లకు నెటిజన్లు కొన్ని ప్రశ్నలు అడిగితే మాత్రం సహనం కోల్పోతారు. తాజాగా తమిళం నుంచి బాలీవుడ్ వరకూ తన అందంతో, నటనతో ఆకట్టుకుంటున్న మాళవిక మోహనన్ ఈ విషయంలో నెటిజన్లకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. తన సినిమాల విషయాన్ని పక్కనపెడితే, మాళవిక సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. తన ఫాలోవర్స్‌తో రెగ్యులర్‌గా ఇంటరాక్ట్ అవుతూ, వారికి సమాధానాలు ఇస్తుంది. అయితే ఇటీవలి కాలంలో ఆమెకు వచ్చిన కొన్ని ప్రశ్నలు ఊహించనివి. ఎప్పటిలాగే ఓ ట్విట్టర్ సెషన్‌లో ఫ్యాన్స్ కొన్ని సాధారణ ప్రశ్నలు



అడిగితే, మరికొంతమంది మాత్రం హద్దులు మీరేలా ప్రశ్నలు సంధించారు. ఇందులో ఓ నెటిజన్ తనను పెళ్లి చేసుకోవాలంటూ అడిగితే, మాళవిక అసహనం వ్యక్తం చేసింది. అయితే పెళ్లి ప్రస్తావన వద్దనుకుంటే, మరో నెటిజన్ అడిగిన ప్రశ్న మరింత దారుణం. "మీరు వర్జినా?" అంటూ ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నను చూసి మాళవిక అసహనానికి గురైంది. ఇలాంటి అసభ్యకరమైన ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారని స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. "ఇలాంటి చెత్త ప్రశ్నలు అడగడం మానేయండి" అంటూ తిప్పికొట్టింది. దీనితో ఆ నెటిజన్ తన పోస్ట్‌ను వెంటనే డిలీట్ చేసేసినా, అప్పటికే స్క్రీన్‌షాట్లు వైరల్ కావడం గమనార్హం. ఇలాంటి అనవసరమైన ప్రశ్నలు అడిగే నెటిజన్ల గురించి మాళవిక తన బాధను వ్యక్తం చేసింది. గతంలోనూ పలు హీరోయిన్లు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నా, చాలా మంది కనీసం స్పందించలేదు. కానీ మాళవిక మాత్రం నేరుగా సమాధానం ఇవ్వడమే కాదు, నెటిజన్ల ప్రవర్తనను కూడా ప్రశ్నించడం ప్రత్యేకం. ప్రస్తుతం మాళవిక ప్రభాస్ సరసన 'ద రాజా సాబ్'లో నటిస్తోంది. దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న ఈ సినిమా మాళవికకు టాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చేలా ఉండబోతోందని టాక్. ఇదే సమయంలో బాలీవుడ్‌లోనూ సినిమాలు చేస్తూ తన మార్కెట్‌ను పెంచుకునే పనిలో ఉంది. కెరీర్ పరంగా ఇలా ఎదుగుతూ, సోషల్ మీడియాలో కూడా తనదైన స్ట్రాంగ్ స్టాండ్‌తో నిలబడుతున్న మాళవిక నెటిజన్లకు మంచి లెస్సన్ ఇచ్చిందని చెప్పుకోవాలి. ఇలాంటి సందర్భాల్లో సెలబ్రిటీలు ఎక్కువగా మౌనం పాటిస్తారు కానీ, మాళవిక మాత్రం స్ట్రెయిట్‌గా స్పందించి ట్రోల్లింగ్‌ను ఎదుర్కోవడం ఆమె ధైర్యానికి నిదర్శనం. ఈ ఘటనతో ఇకపై ఎవరైనా ఆమెకు ఇలాంటి అసభ్యమైన ప్రశ్నలు అడగాలంటే కాస్త ఆలోచించాల్సిందే.




# ఎవరి ట్రాప్‌లోనూ పడను: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

దిల్లీ: గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధముందని.. ఫొటోలు దిగి చూపించుకోవాల్సిన అవసరం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తానెవరో తెలియకుండానే పీసీసీ అధ్యక్షుడు, సీఎం పదవులకు ఎంపిక చేస్తారా? అని ప్రశ్నించారు. ఎవరి ట్రాప్‌లోనూ తాను పడనన్నారు. విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలిసేందుకు దిల్లీ చేరుకున్న సందర్భంగా సీఎం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి రావడం కాదని.. అసెంబ్లీలో చర్చకు హాజరుకావాలన్నారు. డీలిమిటేషన్.. లిమిటేషన్ ఫర్ సౌత్ అని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి రావాల్సిన వాటిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. ఆయా అంశాలు సాధించుకురావాలనే ఆయన్ను ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు.

**'భారత్ సమ్మిట్'కు క్లియరెన్స్ కోసమే జైశంకర్‌ను కలుస్తున్నా..** తెలంగాణలో 'భారత్ సమ్మిట్' పేరిట ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. సుమారు 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమ్మిట్‌కు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తదితరులు హాజరయ్యే అవకాశముందని చెప్పారు.

భారత్ సమ్మిట్‌కు కేంద్ర ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని.. ఆ విషయంపైనే విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలుస్తున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్రంలో 'మిస్ వరల్డ్' పోటీలు జరగనున్నాయని.. నెలరోజుల పాటు దీనికి సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దీనికోసం రెండు రోజుల్లో అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.





తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని తమిళనాడు డీఎంకే నేతలు ఈరోజు ఢిల్లీ కలిశారు. ఈ నెల 22న చెన్నై వేదికగా జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరగనుందని, అందులో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే నష్టం చర్చించనున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించడానికి ఈ సమావేశానికి రావాలని వారు కోరారు. కాగా, పార్టీ అనుమతి తీసుకున్న తర్వాత తాను ఈ సమావేశానికి హాజరవుతానని రేవంత్ చెప్పారు. డీలిమిటేషన్ ప్రక్రియపై అమలు అనేది ఏ రాష్ట్ర ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా ఉండాలన్నదే ఈ సమావేశ ప్రధాన అజెండాగా చెప్పినట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ పేరిట దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం పన్నుతున్న కుట్రను తిప్పికొట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చలు తీసుకుంటామని సీఎం రేవంత్ వివరించారు. అంతేకాకుండా తమిళనాడు కన్నా ముందే డీలిమిటేషన్‌పై తమిళనాడులో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ అనేది పార్టీలకు అతీతంగా స్పందించాల్సిన అంశమని రేవంత్ చెప్పారు. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల్లోని బీజేపీ కూడా భాగం అవుతుందని, ఈ డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాదికి జరుగుతున్న నష్టం గురించి రాజకీయాలకు అతీతంగా జర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో భారాస ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. తొలుత జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. "ఈ సభ అందరిదీ.. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉన్నాయి. మా అందరి తరఫున పెద్ద మనిషిగా, స్పీకర్‌గా మీరు కూర్చున్నారు. ఈ సభ మీ సొంతం కాదు" అని వ్యాఖ్యానించారు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ ఆక్షేపించారు. జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. స్పీకర్‌ను దూషించేలా ఆయన మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడిన ప్రతి పదాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన అహంకారంతో మాట్లాడకుండా క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ శ్రీధర్‌బాబు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి ఏం తప్పు మాట్లాడారని ప్రశ్నించారు. సభలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయనడంలో తప్పులేదన్నారు. శాసనసభ అంటే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వానికి సంబంధించినది కాదన్నారు.

# సొంత పార్టీ నేతలపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్: సొంత పార్టీ నేతలపై భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణలో భాజపా ప్రభుత్వం రావాలంటే పాత సామాను పార్టీ నుంచి బయటికెళ్లిపోవాలి. కొందరు భాజపా నేతలు తెలంగాణలో ఏ ప్రభుత్వం వస్తే వాళ్లతో రహస్యంగా సమావేశమవుతున్నారు. రహస్య సమావేశాలు పెట్టుకుంటే రాష్ట్రంలో మన ప్రభుత్వం వస్తుందా? జాతీయ నాయకత్వం కూడా ఆలోచన చేయాలి. గొప్పలు చెప్పుకొనే వాళ్లకు రిటైర్‌మెంట్ ఇస్తేనే పార్టీకి మంచి రోజులు. నేనొక్కణ్నే కాదు.. ప్రతి భాజపా నాయకుడు, కార్యకర్తలు ఇదే కోరుకుంటున్నారు" అని రాజాసింగ్ అన్నారు.



# ప్రమాదంలో 85లక్షల మంది విద్యార్థుల భవిత: పేపర్ లీకేజీలపై రాహుల్ గాంధీ

ప్రశ్నాపత్రాల లీక్‌లపై కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మరోసారి స్పందించారు. ఈ లీక్‌ల కారణంగా కష్టపడి చదివే విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. దీనిపై పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ప్రశ్నాపత్రాల లీకులతో 6 రాష్ట్రాల్లోని 85 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. వీటి కారణంగా కష్టపడి చదివే పిల్లలతో పాటు వారి కుటుంబాలు ఒత్తిడికి గురవుతున్నాయి. వారి కష్టానికి తగిన ఫలితం అందడం లేదు. దీని వల్ల కష్టపడి పనిచేయడం కంటే నిజాయితీగా లేకపోవడమే మంచిదనే తప్పుడు సందేశం భవిష్యత్తు తరాలకు వెళ్తుంది. అది ఆమోదయోగ్యం కాదు. నీట్ పేపర్ లీక్ దేశాన్ని కుదిపేసి ఏడాది కూడా కాలేదు. దీనిపై మేము పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తంచేశాం. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం లీకులను అడ్డుకోలేకపోయింది.ఇది వారి వైఫల్యానికి నిదర్శనం. అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు విభేదాలు పక్కనబెట్టి దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వీటిని అరికట్టగలం. ఈ పరీక్షలు మన పిల్లల హక్కు. దాన్ని ఎలాగైనా రక్షించాలి' అని రాహుల్ రాసుకొచ్చారు. పేపర్‌లీక్‌లపై ఓ వార్తా సంస్థ రాసిన కథనాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ పోస్టు చేశారు.



# యూట్యూబ్ చూసి స్మగ్లింగ్ .. సూర్య సినిమాను దింపేసింది..

కన్నడ హీరోయిన్ రన్యారావు బంగారం స్మగ్లింగ్ కేసులో రోజుకో కొత్త కోణం వెలుగు చూస్తోంది. ప్రస్తుతం ఆమె డీఆర్ఐ కస్టడీలో ఉంది. విచారణ సందర్భంగా రన్యా విస్తు పోయే విషయాలను బయటపెట్టింది. తాను దుబాయ్ నుంచి మొదటి సారి బంగారాన్ని స్మగ్లింగ్ చేశానని చెప్పుకొచ్చింది.

ఇంతకు ముందు ఎప్పుడూ తాను దుబాయ్ నుంచి బెంగళూరుకు బంగారం స్మగ్లింగ్ చేయలేదని తెలిపింది. యూట్యూబ్ చూసి బంగారం ఎలా స్మగ్లింగ్ చేయాలో నేర్చుకున్నానని అంది.

**ఫారెన్ నెంబర్ నుంచి ఫోన్లు..** డీఆర్ఐ విచారణలో రన్యారావు మాట్లాడుతూ.. 'మార్చి 1వ తేదీన నాకు గుర్తు తెలియని ఫారెన్ నెంబర్ నుంచి కాల్ వచ్చింది. అంతకు రెండు వారాల ముందు నుంచి నాకు గుర్తు తెలియని ఫారెన్ నెంబర్ల నుంచి కాల్స్ వస్తూ ఉన్నాయి. నన్ను దుబాయ్ ఎయిర్ పోర్టులోని టెర్మినల్ 3 వద్ద ఉన్న గేట్ దగ్గరకు వెళ్లమని చెప్పారు. అక్కడ బంగారాన్ని తీసుకుని దుబాయ్ నుంచి బెంగళూరులో డెలివరీ ఇవ్వమని అన్నారు. ఆ బంగారం మొత్తం ప్లాస్టిక్ పాకెట్స్ లో ఉంది. వాటిని నేను నా శరీరానికి అతికించుకున్నాను. దుస్తులు, బూట్లలోనూ కొంత బంగారాన్ని దాచాను' అని చెప్పింది.

**అచ్చం సూర్య సినిమాలోలాగా..** వీడొక్కడే సినిమాలో హీరో సూర్య ఆఫ్రికా నుంచి వజ్రాలు స్మగ్లింగ్ చేస్తాడు. చెన్నై ఎయిర్ పోర్టు అధికారులకు దొరకకుండా ఉండడానికి వజ్రాలను ఓ బాటిల్‌కు అతికిస్తాడు. ఈ పనంతా ఎయిర్‌పోర్టు రెస్ట్ రూములో కూర్చుని చేస్తాడు. అచ్చం సూర్య చేసినట్లుగానే రన్యా రావు కూడా చేసింది.

బంగారాన్ని స్మగ్లింగ్ చేయడానికి దుబాయ్ ఎయిర్ పోర్టు రెస్ట్ రూమును వాడుకుంది. రెస్ట్ రూములోనే బంగారాన్ని తన శరీరానికి అతికించుకుంది. ఎంత పక్కాగా ప్లాన్ చేసినా కూడా కస్టమ్స్ అధికారులకు దొరికి పోయింది.

# రాములమ్మ ఎవరి కోటా? కాంగ్రెస్ అనూహ్య నిర్ణయానికి కారణమేంటి?



హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీల ఎంపికలో కాంగ్రెస్ అధిష్ఠానం అనూహ్య నిర్ణయం తీసుకోవడం చర్చకు దారితీస్తోంది. ఎవరి అంచనాల్లోనూ లేని ఫైర్ బ్రాండ్ విజయశాంతి బీసీ మహిళ కోటాలో ఎమ్మెల్సీ సీటును తన్నుకుపోవడం హస్తం పార్టీలో సీనియర్లకు షాక్ ఇచ్చిందని అంటున్నారు. కాంగ్రెస్ లో ఢిల్లీ, లోకల్, సీనియర్స్, సీఎం అంటూ చాలా కేటగిరీలు ఉంటాయని, మరి విజయశాంతి ఏ కేటగిరీలో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారనేదానిపైనే కార్యకర్తలు పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు. మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు గాను కాంగ్రెస్ తన బలంతో 4 స్థానాలను గెలిపించుకునే అవకాశం ఉంది. ఇందులో ఒకటి మిత్రపక్షం సీపీఐకి ఇవ్వడంతో ఇంకా మూడు స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఆ మూడు సీట్లు కేటాయించింది. ఎస్సీ కోటాలో ఎంపికైన అద్దంకి దయాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా పేరుంది. అసెంబ్లీ ఎన్నికలతోపాటు పార్లమెంటు ఎన్నికలు, నామినేటెడ్ పోస్టులు ఇలా 15 నెలలుగా ఆయన త్యాగాలు చేస్తూ ఉండటంతో ఈ సారి ఆయనకు తప్పక అవకాశం ఇవ్వాల్సివచ్చిందని అంటున్నారు. అదేవిధంగా సీనియర్ నేతగా, ఎస్టీ కేటగిరీలో నల్లొండ నేతల సిఫార్సులతో శంకర్ నాయక్ పేరు సిఫార్సు చేశారు. ఈ సీటు లోకల్ కోటాగా పరిగణిస్తున్నారు. ఇక మిగిలిన రెండు కేటగిరిలో రాములమ్మ విజయశాంతి ఏ కేటగిరీ కింద ఎమ్మెల్సీ కైవసం చేసుకున్నారనేది కాంగ్రెస్ కేడర్ కు అంతుచిక్కడం లేదు. గత ఎన్నికల ముందే కాంగ్రెస్ లోకి వచ్చిన విజయశాంతి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండిపోయారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి ఆమె కాస్త సైలెంటుగానే ఉంటున్నారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎక్కడా పెద్దగా కనిపించడం లేదు. అయితే అనూహ్యంగా ఆమెను ఎమ్మెల్సీగా ఎంపిక చేసి మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్ లోకి తెచ్చింది కాంగ్రెస్ అధిష్టానం. పార్టీతో టచ్ లో ఉండీ లేనట్లు ఉన్న విజయశాంతికి ఎవరి సిఫార్సుతో ఎమ్మెల్సీ సీటు దక్కిందనేది ఎవరికీ అంతుచిక్కడం లేదంటున్నారు. అయితే విజయశాంతి నేరుగా హైకమాండ్ కోటా నుంచే ఎమ్మెల్సీగా ఎంపికయ్యారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల ముందు పార్టీలో చేరినప్పుడే విజయశాంతికి ఎమ్మెల్సీ హామీ ఇచ్చారని, పైగా రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సినీ రంగంతో కొంత పెరిగిందనే ప్రచారం నేపథ్యంలో అనూహ్యంగా రాములమ్మ పేరు తెరపైకి వచ్చిందని చెబుతున్నారు.

# కులగణనలో కేసీఆర్ కుటుంబం పాల్గొనలేదు: ఆది శ్రీనివాస్

హైదరాబాద్: రాష్ట్రంలో కులగణన శాస్త్రీయంగా జరిగిందని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు దీనిలో పాల్గొనలేదని చెప్పారు.

శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టిన అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడారు. "కేసీఆర్ ప్రభుత్వం రూ. 7లక్షల కోట్ల అప్పులు చేసింది. గత ప్రభుత్వం కేవలం రైతుబంధు ఇచ్చి మిగతా అన్ని పథకాలూ ఆపేసింది. రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. సన్న వడ్లు పండించిన వారికి రూ. 500 బోనస్ ఇస్తున్నాం. మా ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టులన్నీ వేగంగా ముందుకెళ్తున్నాయి" అని ఆది శ్రీనివాస్ అన్నారు.



# కేంద్రంపై నెట్టేసి తప్పించుకోవాలనుకుంటున్నారా?: బండి సంజయ్

హైదరాబాద్: రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో పంటలు ఎండినా ప్రభుత్వానికి పట్టింపు లేదా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "అన్నదాతల ఆక్రందనలు వినిపించడం లేదా? కాలువల్లో నీళ్లున్నా ఎందుకు వదలడం లేదు? రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతులు ఎందుకు మూల్యం చెల్లించాలి? దీన్ని కూడా కేంద్రంపై నెట్టేసి తప్పించుకోవాలనుకుంటున్నారా? రైతు భరోసా ఇవ్వరు.. రుణమాఫీ పూర్తి చేయరు.. పంట నష్టపరిహారం ఇవ్వరు. ఇదేనా కాంగ్రెస్ (%జశీఅస్త్రతీవం౦%) మార్క్ రైతు సంక్షేమ రాజ్యమంటే? రాజకీయ నాయకుల స్టేచర్ గురించి కాదు.. రైతుల ఫ్యూచర్ ఆలోచించండి. అసెంబ్లీలో తక్షణమే రైతు సమస్యలపై చర్చించండి. కష్టాల్లో ఉన్న అన్నదాతలను ఆదుకునే చర్యలు చేపట్టండి. యాసంగి పూర్తయ్యే వరకు నీళ్లు వదలండి" అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.



# సికింద్రాబాద్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ స్టాప్ రద్దు

హైదరాబాద్: విశాఖపట్నం-లింగంపల్లి-విశాఖపట్నం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు సికింద్రాబాద్‌లో స్టాప్‌ను రద్దు చేశారు. ఏప్రిల్ 25 నుంచి ఇది అమల్లోకి వస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలును చర్లపల్లి-అమ్ముగూడ-సనత్‌నగర్ మీదుగా శాశ్వత ప్రాతిపదికన దారి మళ్లిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 25 నుంచి సికింద్రాబాద్, బేగంపేట్ స్టేషన్ల వైపు వెళ్లదని అధికారులు తెలిపారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం-లింగంపల్లి-విశాఖపట్నం మధ్య ప్రతి రోజూ నడుస్తోంది.



Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com